అణ్వాస్త్ర మహాసభ

సుజనశ్రీ

చలిగాలి రివ్వున వీస్తోంది. విపరీతంగా మంచు పడుతోంది. ఇళ్ళమీదా, మేడలూ మిద్దెలపైనా, చెట్లూ చేమల మీదా, నేలమీద తెల్లని దుప్పటి పరిచినట్టుగా మంచు పడి పేరుకు పోతున్నది.

శ్రీనగర్ పట్టణానికి వెలుపలగా పెద్ద మైదానంలో విశాలమైన బంగళా అది. దాని చుట్టూరా సాయుధ సైనికులు ఆయుధాలతో కాపలా కాస్తున్నారు. ఆహారం కోసం పొంచి చూస్తూ వేచి కాచుకునే డేగల్లా గూఢ చారులు అప్రమత్తతో కలయ దిరుగుతున్నారు.

ఆ బంగళాకు రెండు వైపులనుంచి మాత్రమే రహదారి ఉంది. ఆ దారుల వెంటగట్టి బందోబస్తు ఏర్పాటు చేయ

బడింది. లోపల వివిధ దేశాల ప్రతినిధులతో 'అణ్వాస్త్ర మహాసభ' సమావేశాలు జరుగుతున్నాయి.

బంగళాకు రెండువందల గజాల దూరంలో పెద్ద గేటు ఉంది. కార్లు ఒక్కొక్కటే అక్కడకు వచ్చి ఆగుతున్నయ్.

గేటుకి కాపలాగా మెషీన్‌గన్స్ పుచ్చుకుని సైనికులు గస్తీ తిరుగుతున్నారు. పోలీసుదళంవారు కారుని ఆపి, ఐడెంటిటీ సర్టిఫికెట్లు, ప్రవేశ పత్రాలూ, కారులోని వ్యక్తుల్నీ తనిఖీచేసి మరీ లోపలకు వదలుతున్నారు.

గేటు లోపలగా ఇన్‌స్పెక్టర్ జనరల్ మహేంద్ర నెమ్మదిగా అడుగులు వేస్తూ ముందరకు నడిచాడు. అతని డిప్యూటీ నిలబడివున్న చోట ఆగిపోయాడు.

"అబ్బ! ఒకటే మంచు! కదూ?" మహేంద్ర అడిగాడు.

"మంచేమిటి సార్! ప్రాణాలే గడ్డకట్టుకుపోతుంటేను!" డిప్యూటి ఐ. జి. లాల్ బదులు పలికాడు.

మహేంద్ర తల పైకెత్తి ఆకాశంవంక చూశాడు. ఆ తర్వాత ముఖంమీద పడుతున్న మంచుని తుడుచుకుంటూ బంగళా పైకిచూశాడు. అంత మంచులోనూ బంగళామీద ఉన్నికోట్లు ధరించి కొందరు సైనికులు మెషీన్‌గన్స్ పుచ్చుకుని తిరుగుతున్నారు.

"మన పరిస్థితి కొంచెం నయం! ఆ బంగళాపై పహరా కాసేవాళ్ళ దుస్థితి వర్ణనాతీతం!"

"అవును సర్! ఇవ్వాల్టికి ఈ సమావేశం త్వరగా ముగించేస్తే బాగుండును!"

"నిజమే! కాని ఈ రోజు సభలో అమెరికా దేశపు రాయబారి ప్రసంగం అతి ముఖ్యమయినదిగా భావించబడుతోంది. అది అయిపోతే సమావేశం ఈ రోజుకు

ముగిసినట్టే!'' మహేంద్ర వివరించాడు.

"లోపలున్న వాళ్ళకు ఈ చలి బాధలేదు కదూ? లోపలంతా ఎయిర్ కండిషన్డ్ చేయబడి వెచ్చగా ఉంటుంది!''

గేటునుంచి బంగళావరకూ కట్టబడిన రంగురంగుల విదేశీ జెండాలు సైతం, ఆ మంచులో, రెపరెపలాడకుండా, బరువుగా వాలిపోయి ఉన్నై.

"మనవాళ్ళు చాల అప్రమత్తతగా ఉన్నారు సార్! ఈ మంచులో నానటం దేనికి? అలా వరండాలో నిలబడదాం రండి సార్!'' లాల్ సూచించాడు.

"ఇంతసేపు ఉన్నాం! మరికొంచెం ఓపిక పడితే, ఆమెరికా ప్రతినిధిని లోపలకు పంపితే కొంత బరువు తీరుతుంది!'' మహేంద్ర అక్కడే నిలబడిపోయాడు.

గేటు కవతలగా సుమారంలో వస్తున్న కార్లవంక చూశాడు మహేంద్ర.

"అవిగో!అవి అమెరికన్ రాయబార కార్యాలయానివిలాగున్నాయ్!'' అన్నాడు.

లాల్ గూడ అటువంక చూశాడు.

గేటుదగ్గర నిలబడివున్న పోలీసు ఇన్స్పెక్టర్ హడావిడిగా గేటు ముందాగిన కారువద్దకు వెళ్ళాడు. కొద్దిగా వంగి వెనకసీట్లో కూర్చున్న రాయబారిని విష్ చేసి డ్రైవరు అందించిన కారు పర్మిట్ నీ, ఇతర పత్రాలనూ త్వరితంగా చూడటం ముగించి గేటుకానుకుని ఉన్న పోలీసులకు సంజ్ఞ చేశాడు. ఆ తర్వాత దాని వెనుకనున్న కారునిగూడ అలాగే పంపారు లోనికి.

గేటు తెరుచుకుంది. కారు లోపలకు వచ్చింది. దాని వెంటే మరో కారుగూడ అలాగే గేటు దాటింది.

బంగళాలోంచి నలుగురైదుగురు వ్యక్తులు వచ్చారు. ముందువచ్చిన కారు డోర్ తెరిచి అందులోని వ్యక్తులకు స్వాగతం చెప్పి లోనికి తీసుకెళ్ళారు.

మరో ఇద్దరు వ్యక్తులు రెండో కారు డోర్ తెరిచి అందులోని రాయబారిని విష్ చేశారు.

అతడు అమెరికా దేశానికి చెందిన ప్రతినిధి. నవ్వుతూ కారులోంచి దిగాడు క్రిందకు.

మహేంద్ర "హమ్మయ్య!" అనుకుని వాచీవంక చూసుకున్నాడు.

"ఢాం! ఢాం! ఢాం! ఢాం! ఢాం!" మెషిన్‌గన్ పేలిన చప్పుడు విని ఎక్కడి వారక్కడే నేలమీద బోర్లా పడిపోయారు.

నేలబారుగా పడుకొని మహేంద్ర తలప్రక్కకు త్రిప్పి కాల్పులు వచ్చినవేపు చూశాడు.

బంగళామీదున్న ఆర్చిల చాటునుంచి దొంగచాటుగా కాల్చారెవరో.

చిన్న కారులోంచి దిగిన అమెరికన్ దేశీయుడు రక్తపు మడుగులో పడివున్నాడు. అతడి అనుచరులు కారుక్రిందకు దూరి దాక్కున్నారు.

ఒక్కనిముషం గడిచింది. నేలమీద ఎవరో కదిలారు.

"ఢాం! ఢాం! ఢాం!" మళ్ళీ మెషిన్ గన్‌లోంచి గుండ్ల వర్షం కురిసింది. కొన్ని గుళ్ళు కారుకి తగిలి కారు నిండా మరకల్నీ, కంతల్నీ ఏర్పరచినయ్.

నాలుగు వైపుల్నుంచి సైనికులు బంగళామీదకు కాల్పులు జరుపుతూ ముందుకు వస్తున్నారు.

బంగళామీద కాపలా కాస్తున్న సైనికులు గూడ కాల్పులు మొదలెట్టారు.

అయినా హంతకుడు పైన ఆర్చిల్లో ఎక్కడో దాక్కున్నాడు. మంచులో పరుగెత్తాలంటే కాలు జర్రున జారుతోంది. బంగళామీద నడుస్తున్న సైనికుడి కాలు జర్రున జారుతోంది. బంగళామీద నడుస్తున్న సైనికుడి కాలుజారి పైనుంచి క్రిందకు పడిపోయాడు. అతడి కాలు విరిగింది.

ఇద్దరు సైనికులు అతడి దగ్గరకు పరుగెత్తారు. అతడ్ని చేతులమీదుగా వేసుకుని వరండాలో సురక్షితమైన చోటుకి చేర్చారు.

బంగళామీద కాల్పులు ఎక్కువైనయ్. రాయబారిపై కాల్పులు జరిపిన ఆగంతకుడు పరిగెత్తాడు ఒక దిశగా నక్కుతూ. కాని అతడి కాలుజారింది. క్రిందపడిపోయాడు. అతడి చేతిలోని మెషిన్‌గన్ కూడ చేయిజారి బంగళా ఆర్చిలమీదనుంచి క్రిందకు పడింది.

"అతడ్ని ప్రాణాలతో పట్టుకోండి!" మహేంద్ర అరిచాడు.

కాల్పులు జరపబోతున్న సైనికులు ఆగిపోయారు. మిషన్ గన్స్ అతడికి గురిపెట్టి ముందుకు నడిచారు.

ఒక సైనికుడు ఆగంతకుడి కాలర్ పట్టుకు పైకి లేవదీసి నిలబెట్టాడు.

గూఢచారి శాఖ డైరక్టర్ ఛటర్జీ కూడ బంగళా బయటకు వచ్చాడు.

సైనికులు ఆగంతకుడ్ని లాక్కొస్తున్నారు.

"బంగళా లోపలకు ఈ అలజడి ఏమీ వినిపించలేదు గదా!" మహేంద్ర అడిగాడు.

"లోపలంతా సౌండ్ ప్రూఫ్! ఈ కాల్పులు వినిపించవు!" ఛటర్జీ బదులు చెప్పాడు.

ఛటర్జీ బంధితుడి ముఖంలోకి చూశాడు.

అతడు అయిదున్నరడుగుల ఎత్తున్నాడు. ఆ పోలీసు ఉద్యోగుల ముందు అతడు చాల పొట్టివాడులా కనబడు తున్నాడు. అతడిది కోలముఖం. కళ్లు చిన్నవి.

"అంగామీ జాతివాడిలా ఉన్నాడు!" ఛటర్జీ స్వగతంలా పలికాడు.

"ఈజ్ ఇట్?" మహేంద్ర ఆశ్చర్యంగా అతడివంక చూస్తూ అన్నాడు.

నేరస్తుడు తను తప్పుచేసినవాడిలా బాధపడటంలేదు. పైగా తానేదో ఘనకార్యం చేసిన వాడిలా గర్వంగా చూస్తున్నాడు.

"అగ్రదేశ రాయబారిని కావాలనే చంపాను. కాకపోతే చిన్న దేశాలపై తన అధికారాన్ని రుద్దాలని చూస్తాడా? విజయం మాదే!" అని సంతోషంగా అరిచాడు.

2

సాయుధ సైనిక పహారాలో హంతకుడు మరోచోటికి తరలించబడ్డాడు.

ఛటర్జీ, మహేంద్ర ఇద్దరూ కాన్ఫరెన్సు హాల్లోకి అడుగు పెట్టారు. విజిటర్స్ గ్యాలరీలో వెనుక వరుసలో నిలబడి సమావేశానికి హాజరయిన వ్యక్తులందర్నీ ఒకసారి తిరగేసి చూశారు.

స్టేజీమీద కెనడా దేశపు రాయబారి ప్రసంగిస్తున్నాడు. అతడి వెనుకగా పెద్ద తెరమీద అణుశక్తిని సూచించే డయాగ్రమ్ ఉంది. దానిమీద శాంతి ప్రయోజనాలకే అణుశక్తి అని ఎర్రని అక్షరాలతో వ్రాయబడి వుంది.

"మనలెక్క ప్రకారం అన్ని దేశాల ప్రతినిధులూ వచ్చారేమో ఒకసారి చూడటం మంచిది" అన్నాడు చిన్నగా ఛటర్జీ.

మహేంద్ర ప్రతినిధుల గ్యాలరీవేపు చూసి ఖాళీగా వున్న కుర్చీలను లెక్క వేశాడు. వాటిలో చాలా కుర్చీలు చైనా, పాకిస్థాన్ దేశాల ప్రతినిధులకని ఉద్దేశింపబడినవే.

"చైనాదేశం తరఫున ఆరుగురు ప్రతినిధుల బృందం వస్తారని మనకు ఆదేశం అందింది. కాని ఇద్దరే సమావేశానికి హాజరయ్యారు. అలాగే పాకిస్తాన్ నుంచి నలుగురు రావలసివుంది. వాళ్ళల్లోనూ ఇద్దరే వచ్చారు" అన్నాడు మహేంద్ర.

"సమావేశానికి హాజరవకుండా వున్న వ్యక్తు లెవరయినా ఈ హత్యకు ఏర్పాట్లుచేసి ఉంటారు" బదులు చెప్పాడు ఛటర్జీ, అతడితో ఏకీభవిస్తూ.

హాల్లో చప్పట్లు మ్రోగినయ్. ఇద్దరూ డయాస్(Dias) కేసి చూశారు. కెనడా ప్రతినిధి తన ప్రసంగం ముగించాడు. సభాధ్యక్షుడు లేచి అమెరికన్ ప్రతినిధి పేరు చదివాడు.

ఆపేరు వింటూనే సభలో మరోసారి కరతాళ ధ్వనులు మ్రోగినయ్. అమెరికన్ ప్రతినిధి రాబర్ట్సన్ వేదికమీదకు రాగానే మరోసారి చప్పట్లు మ్రోగినయ్.

సభలో అందర్నీ కలయజూస్తున్నాడు మహేంద్ర. చైనా ప్రతినిధులు ఇద్దరు మాత్రం నిర్వికారంగా కూర్చున్నారు. మిగతా సభాసదుల్లాగ వాళ్ళు కరతాళధ్వని చేయటంలేదు.

"చూశారా! వాళ్ళిద్దరూ రాబర్ట్సన్ అంటే ఏమాత్రం ఆసక్తి చూపటంలేదు! ఇది వాళ్ళపనే అయిఉంటుంది. ఎందుకయినా మంచిది, వాళ్ళపై రహస్య నిఘా ఉంచటం మంచిది" ఛటర్జీ సూచించాడు.

"ఈ సమావేశం ఇంకా మూడు నాలుగు రోజులు

జరగవచ్చు. ఈ లోపల ఇంకా ఎన్ని హత్యా ప్రయత్నాలు జరుగుతాయో!" మహేంద్ర తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు. "ఎలాగైనా మీ ఆలోచనే నెగ్గింది. అదే మన పరువు కాపాడింది. అగ్రదేశాల ప్రతినిధులకు డమ్మీ వ్యక్తుల్ని ఏరి వాళ్ళను మామూలుగా రహదారినే రానిచ్చాం. అసలు నిజమైన ప్రతినిధులు మారువేషాల్లో రహస్య మార్గం గుండా తీసుకురాబడ్డారు. ఈ హత్యా ప్రయత్నంలో అమెరికాదేశపు ప్రతినిధి తాలూకు డమ్మీ మాత్రమే హత్య చేయబడ్డాడు. లేకపోతే ఈ నాటితో భారతదేశం పరువు గంగపాలయి ఉండేది."

ఛటర్జీ మీసం దువ్వుకుంటూ నవ్వాడు. "ఇక మనం ఇక్కడ కాలయాపన చేస్తుంటే లాభం లేదు. అక్కడ మన అతిథి నోటినుంచి అసలు సమాచారాన్ని ఎంత త్వరగా కక్కిస్తే అంత మంచిది" అంటూ బయటికి నడిచాడు.

మహేంద్ర గూడ అతడ్ని అనుసరించాడు. పోర్టికోకి దగ్గరగా కారు వచ్చింది. డోర్ తెరుచుకుని ఇద్దరూ లోపల కూర్చున్నారు. కారు ముందుకి సాగిపోయింది.

"ఈ మీటింగ్ అయిపోంగానే అమెరికా ప్రతినిధి చనిపోలేదని మన శత్రువులు తెలుసుకుంటారు. మళ్ళీ అతడిపై హత్యా ప్రయత్నం జరగవచ్చు. కనుక మనం త్వరపడి, మరో ఉపాయం ఆలోచించి ఆ ప్రయత్నాన్ని గూడ వమ్ము చేయాలి."

3

బల్లమీద టెలిఫోన్ మ్రోగింది.

ఛటర్జీ రిసీవరెత్తి "హలో" అన్నాడు. మరో బటన్ నొక్కేసరికి అవతలవైపునుంచి ఫోన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ ఐ. జి. లాల్ టెలివిజన్ స్క్రీన్ మీద కనబడుతున్నాడు.

"అతడిచేత మాట్లాడించాలని చాల ప్రయత్నంచేశాం సార్! ఎంత సేపటికీ 'అమెరికా పొగరు అణచాలి. దౌర్జన్యం నశించాలి' అనే పదాలు తప్ప మరో మాట వాడినోటి వెంటనుంచి రావటంలేదు. వాడు ఇంకా అపోహలోనే ఉన్నాడు, తను నిజంగానే అమెరికా ప్రతినిధిని హత్య చేశాననే!"

"అలాగా! వాడికి నిజం చెప్పేయకపోయారూ? తన ప్రయత్నం భగ్నమైందన్న విచారంలోనన్నా, ఈ కుట్ర వెనుక వ్యక్తుల గురించి చెప్పేస్తాడేమో!"

"కొంచెం ఆగి చెబుతాం సార్! మనవాళ్ళు ఒక ప్రశ్నల పట్టీలాగ తయారుచేశారు సార్! వాటికి వాడు అవును, కాదన్నట్టు తలాడించి సంజ్ఞలతోనే జవాబు చెప్పాడు!"

"ఏమిటా ప్రశ్నలు? వివరంగా చెప్పండి లాల్!"

"వాడి పేరు 'బులంగా' అని చెప్పాడు. తను క్రితం రాత్రే ఆ బంగళామీదకు ఎక్కి చిమ్నీలో దాక్కున్నట్టు ఒప్పుకున్నాడు. అతడి చేతిలోని మిషీన్‌గన్‌ని ఎవరిచ్చారని అడిగాం. సమాధానంలేదు. అమెరికా ప్రతినిధిని చంపమని ఎవరు పురమాయించారని అడిగాం. దానికీ బదులులేదు. తను ప్రాణత్యాగంచేసి అయినా సరే రాబర్ట్‌సన్‌ని చంపడమే తన ధ్యేయం అంటాడు."

"ఆ పంది వెధవ చావకుండా ఎన్ని బాధలు పెట్టి అయినా సరే వాడిచేత నిజం కక్కించండి. మరో గంట గడిచాక నాకు ఫోన్‌చేసి చెప్పండి మళ్ళీ. అప్పటికీ వాడే సంగతీ చెప్పకపోతే ఏంచేయాలో అప్పుడు నిర్ణయిద్దాం!"

"సరే సార్!"

ఛటర్జీ ఫోన్ పెట్టేశాడు. జేబులోంచి సిగరెట్ తీసి

వెలిగించుకుని, సిగరెట్ ప్యాకెట్‌ని మహేంద్ర ముందుం నాడు.

"రాబర్ట్‌సన్‌పై హత్యా ప్రయత్నం జరుగుతుందని కేవలం నేను ఊహించిన విషయంకాదు. ఆ రహస్య సమాచారం నాకు ముందే తెలుసు. పాకిస్తాన్‌లో పోస్టు చేయబడిన ఒక జాబు ద్వారా రష్యాకు ఈ రూమర్ తెలియజేయబడింది. అక్కడ్నుంచి ఆ సమాచారం మనకు తెలియజేయబడింది.

వెంటనే మరో సీక్రెట్ ఏజెంట్‌ని పాకిస్తాన్‌కి పంపాం, ఆ వుత్తరం గురించి ఇంకా వివరాలు రాబట్టేందుకు. కాని అతడు లాహోర్ చేరేసరికి అతడు హత్య చేయబడ్డాడు.

అంటే ఈ సమాచారం భారతదేశానికి చేరిందని శత్రువులు కనిపెట్టారన్నమాట. ఆటు తర్వాత అమెరికన్ ప్రతినిధి రాబర్ట్‌సన్‌ని ఎలా కాపాడాలా అని ఆలోచించాం. సరిగ్గా అతన్ని పోలిన మరో అమెరికన్‌ని ఎన్నుకున్నాం. అసలు రాబర్ట్‌సన్ మనం సూచించిన రహస్య మార్గాన సమావేశానికి హాజరయే ఏర్పాటుచేశాం. నకిలీ వ్యక్తికి కొంచెం మేకప్ చేసేసరికి అతడు అసలు రాబర్ట్‌సన్ నే తలదన్నేలా తయారయారు. ఆ వ్యక్తిని మెయిన్ రోడ్ గుండా తీసుకువచ్చాం."

"ఎలాగైతేనేం మీ పథకం రాబర్ట్‌సన్‌ని ఈసారికి కాపాడింది. మన శత్రువులు తమ ప్రయత్నం విఫలమయిందని తెలుసుకుని మనపై ప్రతీకారం తీర్చుకునేందుకు మరో దేశపు ప్రతినిధిపై దెబ్బ తీస్తేనో?"

"అప్పుడు మనం ఇరకాటంలో పడ్డట్టే! అందుకే ప్రతినిధులందర్నీ బుల్లెట్ ప్రూఫ్ కార్లలో తీసుకువెళ్ళే ఏర్పాటు చేశాం. వాళ్ళ రాకపోకల్ని అతిరహస్యంగా వుంచాం.

అసలు ప్రతినిధి రావటానికి అరగంట ముందే రాజలాంఛనాలతో ఆ దేశపు వ్యక్తుల్ని కొందర్ని బహిరంగంగా తిరగనిస్తున్నాం. ఎందుకనంటే ఎవరైనా హంతకులు కాచుకుని గనుక ఉంటే ఈ హడావిడిలో మామూలు వ్యక్తుల్నే ప్రతినిధులుగా భావించి కాల్పులు జరపచ్చు. వాళ్ళని మనం వెంటనే బంధిస్తాం!"

"అయితే ఇప్పుడు పరిస్థితి అంతా బులుంగా మీద ఆధారపడి వుంది."

"అంతే!" అన్నాడు ఛటర్జీ.

"లాల్ని పిలిచి బులుంగా విషయం కనుక్కోనా?" అంటూ మహేంద్ర రిసీవరెత్తి డయల్ చేశాడు. ఫోన్ అవతలవైపు మ్రోగింది. మరుక్షణంలో టెలివిజన్ స్క్రీన్ మీద లాల్ ప్రత్యక్షమయాడు. "బులుంగానుంచి మనకు కావలసిన సమాచారం రాలేదు సార్!" అని జవాబిచ్చాడు లాల్.

"విన్నారుగా ఛటర్జీ! ఇప్పుడేం చేద్దాం!" మహేంద్ర ఛటర్జీ వైపు చూశాడు.

చేత్తో తల నిమురుకున్నాడు ఛటర్జీ. పైకప్పుకేసి ఒక సెకండు చూశాడు.

"నాకు ఒకే ఒక మార్గం తోస్తున్నది. అఫ్ కోర్స్ అది చాల పాత ట్రిక్కే అనుకోండి. వాడ్ని సెంట్రల్ జైలుకి మార్చే మిషతో అక్కడ్నుంచి తప్పించి, పారిపోయేటందుకు అవకాశం ఇద్దాం! వాడు ఎక్కడకు పోతాడో ఎవరెవర్ని కలుస్తాడో కనుక్కోవటమే! అంతకన్న ప్రస్తుతానికి మరో మార్గం కనబడటంలేదు" అన్నాడు ఛటర్జీ.

మహేంద్ర ఫోన్లో లాల్కి అదే చెప్పాడు.

4

పోలీస్ స్టేషన్ నుంచి బులుంగాని బయటగా తీసుకు వచ్చారు. అతడి వెంట మరో కానిస్టేబుల్ ని ఎస్కార్ట్ క్రింద పంపారు.

బులుంగా చేతికి బేడీలు వేయకుండా కానిస్టేబుల్ నడి పించుకు పోసాగాడు.

బులుంగా కళ్ళు ఆశగా మెరిసినయ్. మళ్ళీ తనని కొత్తచోట జైలులో ఎన్ని హింసలు పెడతారో, కనుక ఆ ప్రదేశానికి చేరలోపలే తన పని పూర్తిచేసుకోవాలి అనుకున్నాడు.

రోడ్డుమీద జనం అట్టేలేరు. కార్లూ, లారీలు మాత్రం తిరుగుతున్నయ్.

కానిస్టేబుల్ ప్రక్కగా నడుస్తున్న బులుంగా పరుగు లెత్తాడు. ఎదురుగా లారీ వేగంగా వస్తున్నది. బులుంగా లారీ కడ్డంగా రోడ్డుమీద బోర్లా పడుకున్నాడు. బ్రేకులు వేసినా లారీ ఆగలేదు. టైరు క్రిందపడిన బులుంగా తల చట్నీ అయిపోయి మెదడు బయటకు వెళ్ళుకొచ్చింది.

ఆ దృశ్యం చూసిన కానిస్టేబుల్ గతుక్కుమన్నాడు. తమ డిపార్టుమెంటు ప్లాన్ ని కాస్త భగ్నంచేస్తూ, బులుంగా ఆత్మహత్య చేసుకున్నాడు.

మరోసారి గూఢచారి శాఖలో అందరూ సమావేశ మైనారు.

బులుంగా ఎక్కడ నివసించేదీ ఆరా తీయబడింది. అతడు ఒక నెల క్రితం శ్రీనగర్ కు వచ్చినట్టు వాళ్ళ కూపీలో తెలిసిన విషయం. అతడొక్కడే ఏదో తక్కువ క్లాసు హోటల్లో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడట. అతడితో ఎక్కువగా మాట్లాడిన వాళ్ళుగూడా లేరు. అర్ధరాత్రి

వరకూ అతడితో పరిచయం వున్నదని అనుమానింపబడిన వారినంతా ప్రశ్నించారు. కానీ ఎటువంటి సమాచారమూ దొరకలేదు వారికి.

ఐ. జి. మహేంద్ర సీరియస్‌గా సిగరెట్ మీద సిగరెట్‌ని కాలుస్తూ కూర్చున్నాడు. అతడి ముందర బులుంగా గూర్ఖి పోలీసులూ, సి. ఐ. డీలూ పంపిన రిపోర్టుల కట్టవుంది టేబుల్ మీద.

ఛటర్జీ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఆరా తేసేందుకని నిర్దేశింపబడిన ప్రతి ఏజెంట్ గురించీ అడుగుతున్నాడు ఫోన్‌లో.

"రాధారమణ్ రిపోర్టు రాలేదు ఇంకా! ఆ గోపీనాథ్‌ని ఎటు పంపారూ? నెంబర్ 16 ఏమయినట్టు?"

"రాధారమణీ, గోపీనాథ్‌ల సమాచారంలో ఏవీ ఉపయోగ పడేది లేదుసార్! పోతే కృష్ణమూర్తి అదే నెంబర్ 16 సార్! అతడి కెవరో అనుమానాస్పదమైన వ్యక్తి తగిలాడనీ, అతడ్ని వెంటాడటానికి పోతున్నట్టు తిరిగి త్వరలో ఫోన్ చేస్తానని చెప్పాడు."

"అలాగా! అతనికేమైనా సాయం కావాలేమో మరి కొందర్ని పంపండి!" ఛటర్జీ ఫోన్ పెట్టేశాడు.

టేబుల్ మీది మరో ఫోన్ మ్రోగింది.

"సార్! రక్షణ మంత్రిగారు మిమ్మల్ని చూడాలని బయలుదేరారు సర్!"

ఛటర్జీ క్రేడిల్ మీద రిసీవర్ని పడేశాడు.

"రక్షణ మంత్రిగారు వస్తున్నాడట!" అని పెద్దగా వెల్లడించాడు. ఇద్దరు అటెండర్లు వచ్చి టేబుల్ మీది ఏష్ ట్రేలోని సిగరెట్ పీకల్ని తీసి పారేసి శుభ్రం చేశారు. పై అధికారి తనిఖీకి వస్తున్నాడా అన్నట్టుగా ఆఫీసు రూమ్ సర్దారు.

ఛటర్జీ, మహేంద్ర ఇద్దరూ రోడ్ మీదకు వెళ్ళి, కారు ఆగంగానే డోర్ తెరచి, రక్షణ మంత్రిగారిని రిసీవ్ చేసుకుని లోపలకు తీసుకువచ్చారు.

"నిన్నటి ప్రమాదాన్ని ఎదుర్కొన్న తీరు తెలిశాక మిమ్మల్ని అభినందించలేకుండా ఉన్నాను" ఇద్దరి వంకా చూస్తూ రక్షణ మంత్రి అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

"థాంక్యూ సర్!" ఇద్దరూ ఏకకంఠంతో అన్నారు.

మహేంద్ర జరిగిన వృత్తాంతమంతా ఆయనకు వివరించి చెప్పాడు.

"ఎంత పెద్ద గండం గడిచింది! నిజంగా రాబర్ట్‌సన్ గనుకే హత్య చేయబడి ఉంటే మనదేశపు పరువూ, ప్రతిష్ట మంట గలిసివుండేవి. ఈ సభను ఏర్పాటుచేసి, కావాలనే ఈ హత్య చేశారని మనపై ఆరోపణ వచ్చేది. దాంతో మనకు శత్రుదేశాల సంఖ్య పెరిగిపోయేది. మనపై ఈ కుట్రని రుద్దటానికి ప్రయత్నించిన దేశం సంతోషించేది."

"నిజమే సార్!"

"ఇకపోతే ఈ సమావేశం ఇంకా రెండు రోజులపాటు కొనసాగవలసి వుంది. గనుక ఈ రెండు రోజులూ వాళ్ళను కంటికి రెప్పలా కాపాడాలి."

"మా ప్రాణాలు ధారబోసి అయినా కాపాడతాం సర్!" మహేంద్ర నొక్కి వక్కాణించాడు.

స్విచ్‌బోర్డుమీద ఆకు పచ్చని లైటు వెలిగింది. ఛటర్జీ ఆశ్చర్యంగా అటు చూశాడు. బయట రక్షణ మంత్రితో వచ్చిన రక్షక ఉద్యోగులూ, పోలీస్ డిటెక్టివ్‌లూ కాచుకుని వున్నారు. ఈ లైటు వెలిగించటానికి స్విచ్ ఎక్కడుందో తమ శాఖలో చాల కొద్దిమందికి మాత్రమే తెలుసు. అయితే ఆ వచ్చిన వ్యక్తి ఎవరయి వుంటారు?

అతడే అత్యవసర సమాచారాన్ని సేకరించాడో.

ముందుకు వంగి టేబుల్ క్రిందుగా వున్న బటన్ నొక్కాడు మహేంద్ర. లోపలకు రావచ్చని పచ్చలైటు వెలగటానికి స్విచ్ నొక్కిన వ్యక్తికి అది జవాబన్నమాట.

గోడ ప్రక్కగా నిలబెట్టివున్న స్టీల్ అల్మరా తెరుచుకుని అందులోంచి ఒక వ్యక్తి వచ్చాడు. అది నిజానికి స్టీలు బీరువా కాదు. రహస్య ప్రవేశ మార్గం.

ఆ వచ్చిన వ్యక్తి చేతిలో ఏదో పేపరు వుంది.

"ఈవెనింగ్ న్యూస్ అనే పేపరు సార్ ఇది. రాబర్ట్ సన్‌పై హత్యాప్రయత్నం గురించి సాకల్యంగా వివరించాడు ఇందులో. మన సమావేశానికి ఎవరూ పత్రికా విలేఖరులు హాజరు కాలేదు. మరి ఇతగాడికి ఆ సమాచారం ఎవరిచ్చినట్టు?" వచ్చినతను చెప్పాడు.

రక్షణమంత్రి ఛటర్జీ, మహేంద్రల వంక చూశాడు అయోమయంగా. మహేంద్ర అతడి చేతుల్లోని పేపరు లాక్కొని చూశాడు.

మహేంద్ర టెలిఫోన్ మీదకు చేయిచాచాడు. లాల్‌కి ఫోన్ చేసి వెంటనే "ఈవెనింగ్ న్యూస్" పేపరు కాపీలన్నిటినీ స్వాధీనం చేసుకోమనీ, ఆ ఎడిటర్‌పై వెంటనే కేసు పెట్టమని చెప్పాడు.

"మన పరివారాన్ని కేంద్రీకరించి మరింతగా కట్టుబాట్లు చేయండి. అవసరమైతే సైన్యాన్నిగూడ రప్పించండి. ఇక నేను వెళుతున్నాను. ప్రతి మూడు గంటలకి ఒకసారి నాకు ఫోన్ చేసి ఎప్పటి సమాచారం అప్పుడు చెప్పండి."

రక్షణమంత్రి కుర్చీలోంచి లేచాడు. మహేంద్ర, ఛటర్జీ ఆయన్ని బయటివరకూ సాగనంపి తిరిగి వచ్చేలోపల

టేబుల్ మీద టెలిఫోన్ మ్రోగుతోంది.

మహేంద్ర మనసు చికాకుగా వుంది. పరిస్థితి క్షణ క్షణానికి చేయి జారిపోతున్నట్టుగా తోస్తోంది అతడికి.

ఛటర్జీ ఫోన్ రిసీవర్ ఎత్తాడు. "హలో, ఛటర్జీ స్పీకింగ్!"

"గుడ్ ఈవెనింగ్ సార్! నేను కృష్ణమూర్తిని సార్! ఖులుంగా గురించి ఏదో క్లూ దొరికితే దాన్ని వెంటాడుతూ వెళ్ళాను. అందుకని లేటయింది సార్! నేను వెంటబడింది కుందేలుగదా అనుకుంటే పెద్ద తోడేలు ఎదురయింది."

"నిజంగానా? ఇక్కడ మా చేతులు కసితో పిడికిళ్ళు బిగుసుకుంటున్నయ్. మాకు చేతినిండా పని కల్పించే అవసరంకోసమే ఎదురుచూస్తున్నాం!" ఛటర్జీ నవ్వుతూ అన్నాడు.

"హోటల్ సిమ్లాలో ఒక వ్యక్తి తారసపడ్డాడు. అతడి పేరు లక్ష్మణన్. అతడికి మద్రాసు సిటీలోనూ, ఇంకా తమిళనాడులోనూ స్టీల్ మిల్స్ వున్నాయట. అంతేకాదు, తుపాకులూ, రివాల్వర్లూ తయారుచేసే ఫ్యాక్టరీకూడ వున్నదట. అతడు వారం రోజుల క్రితమే దిగాడు ఇక్కడకు.

"హోటల్ సిమ్లాలోనే అరబ్ దేశపు ప్రతినిధులు కూడ బసచేసి వున్నారనే విషయం మీకూ తెలుసు. వాళ్ళతో రహస్యంగా మంతనాలాడుతున్నాడు లక్ష్మణన్. వారితో స్నేహంగా వున్నట్టుగా నటించి వారికేదైనా అపాయం తలపెడతాడేమో అని నా అనుమానం!"

"అలాగా! అయితే అతడ్ని మరింతగా చెక్ చేయలేక పోయావా?"

"మాలాంటి చిన్న వ్యక్తుల్ని అతడు ఖాతరు చేసేలా

లేదు సార్! మనిషి చాలా పొగరుబోతుగా వ్యవహరిస్తు న్నాడు."

"ఇంతకీ అతడికీ ఖులుంగాకీ ఏమిటి కనెక్షన్?"

"అవును సార్! అసలు విషయం చెప్పటం మరిచాను. మూడురోజుల క్రితం ఖులుంగా లక్ష్మణన్‌తో కలిసాడట. ఒకరోజల్లా అతడివెంటే తిరిగాడట."

"హోటల్ సిమ్లాలో అతడి రూమ్ నెంబరు ఎంత?"

"రూమ్ నెంబరు పదహారు సార్?"

"ఓకే! నువ్వు, మరికొందరు గూఢచారులతో అక్కడే వుండు. మేం ఇప్పుడే వస్తున్నాం!" ఛటర్జీ ఫోన్ పెట్టేసి కుర్చీలోంచి లేచాడు.

"మిస్టర్ మహేంద్రా! గెటప్, సింహం జూలు దువ్వ టానికి వెడుతున్నాం మనం!"

మహేంద్ర హుషారుగా లేచాడు.

5

హోటల్ సిమ్లా నిండా వచ్చేపోయే జనంతో హడా విడిగా వుంది.

మహేంద్ర, ఛటర్జీ ఫుల్‌సూట్‌లలో వున్నారు.

కారిడర్‌లో గూఢచారి శాఖలోని వ్యక్తులు అటూ ఇటూ తిరుగుతున్నారు. వారి మధ్యగా ఇద్దరూ నడిచి పై అంతస్తులోకి వెళ్ళారు.

మూడో అంతస్తులో 16 నెంబరు రూమ్ముందు నిలబడి కాలింగ్ బెల్ నొక్కాడు ఛటర్జీ.

కాశ్మీరీ యువతి తలుపు తెరిచింది. "మిస్టర్ లక్ష్మణన్, మద్రాసు! ఆయన్ని చూడాలి మేం!" అన్నాడు మహేంద్ర.

"ఆయన ఇప్పుడు ఎవర్నీ చూచే స్థితిలో లేరు" ఆ యువతి కంగారుగా అంది.

"చాలా అర్జెంటు పని! ఆలస్యం అయితే ఇరుపక్షాల వారికీ నష్టం!" అన్నాడు మహేంద్ర.

ఆమె ఒకనిమిషం తటపటాయించింది. "ఆగండి! ఆయనకు చెప్పి వస్తాను" అంటూ లోపలకు వెళ్ళింది.

ఆమె వెనకనే ఇద్దరూ లోపలకు దూసుకుపోయారు. లక్ష్మణన్ శృంగారంలో మునిగి తేలుతున్నట్టున్నాడు. బెడ్ మీద అ స్తవ్య స్తంగా పడుకుని వున్నాడు.

ఆగంతకుల్ని చూడగానే అతడు కోపంతో లేచి కూర్చున్నాడు. "ఎవరు వీళ్ళంతా? ఎందుకొచ్చారు? తక్షణం బయటకు నడవండి!" అని అరిచాడు పైజమాని పైకి లాక్కుంటూ.

"మిస్టర్ లక్ష్మణన్! మీతో అత్యవసరమైన పనివుండి వచ్చాం!" ఛటర్జీ అన్నాడు తీవ్రంగా.

"నేను బిజినెస్ వ్యవహారాలు చూసే టయిమ్ వేరే వుంది. అప్పుడు రండి! ప్లీస్ గెటవుట్ ఐసే!"

ఛటర్జీ తన కోటుజేబులోంచి ఐడెండిటీ కార్డుతీసి చూపించాడు. "పైగా ఈయనెవరో తెలుసా? ఐ. జి. ఆఫ్ పోలీస్. ఇకనైనా నీ మర్యాద కాపాడుకో! లేదా నిన్ను కటకటాల వెనుక నిలబెట్టి మరీ ప్రశ్నించాల్సి వుంటుంది."

లక్ష్మణన్ పిల్లి అయిపోయాడు. ఆ యువతి వంక చూస్తూ "నువ్వు కాస్సేపు ఆ లోపలకు వెళ్ళు!" అని ఇటువైపు తిరిగాడు.

కుర్చీలు చూపిస్తూ "కూర్చోండి! నావల్ల మీకు కావలసిన సహాయం ఏమిటి?" అని అడిగాడు.

లక్ష్మణన్ మంచి భారీ మనిషి. ఆరడుగుల ఎత్తు, నల్లగా బలిసి, కండలు తిరిగి వున్నాడు. కోర మీసాలు మధ్య

మధ్యలో దువ్వుతూ మాట్లాడుతున్నాడు.

"చూడు మిస్టర్ లక్ష్మణన్! మీరు ఇక్కడకు వచ్చి ఎన్నాళ్ళయింది. ఇంతదూరం ఏ పనిమీద వచ్చారు" మహేంద్ర అడిగాడు.

"నేను మద్రాసునుంచి వచ్చి వారం రోజులయింది. ఆఫీసు, బిజినెస్ వ్యవహారాలనుంచి రెస్ట్ తీసుకుందామని ఇలా హాలీడే ట్రిప్ మీద వచ్చాను."

"ఈవెనింగ్ న్యూస్ చదివారా?"

"లేదు! ఆ పేపరు పేరే వినలేదు ఇంతవరకు!"

"మూడురోజుల క్రితం మిమ్మల్ని బులుంగా అనే అంగామీ జాతి వ్యక్తి కలిశాడు కదూ? అతడితో మీకేం పని?"

లక్ష్మణన్ ఒక్క నిముషం ఆలోచించాడు.

"అవును. అతడిపేరు బులుంగా అనే చెప్పాడు. అయిదడుగుల ఎత్తు, చిన్న కళ్ళు, చదునైన ముఖం. తెల్లగా వుంటాడు! అతనే కదూ మీరు అడిగేది?"

"అవును! అతడే!"

"అతడెవరో అంతక్రితం నాకు తెలీదు. తనకు స్టీల్ మిల్స్‌లో బాగా అనుభవం వుందనీ, నా మిల్లులో ఏదైనా వుద్యోగం ఇప్పించమని బ్రతిమాలాడు. నేను ఏవీ ఖాళీలేవన్నాను. అంతకంటే నా కెక్కువ పరిచయంలేదు. అతడేదన్నా అఘాయిత్యం తలపెట్టాడా? బహుశా ఆత్మ హత్యకు తలపడి వుండవచ్చు!"

"అలా ఎందుకనుకోవాలి?" ఛటర్జీ అడిగాడు.

"ఏదీ వుద్యోగం దొరక్క మనిషి నిరుత్సాహపడ్డట్టుగా తోచింది నాకు."

"ఆత్మహత్యకాదు. ఒక విదేశీ రాయబారిని హత్య

చేయటానికి ప్రయత్నించాడు."

"మెగాడ్! బహుశా అతడ్ని కిడ్నాప్ చేసి తద్వారా డబ్బు సంపాదించాలని ఎత్తువేశాడేమో! అతడ్ని గురించిన నా సమాచారాన్ని మీకు వున్నదున్నట్టుగానే చెప్పాను. ఇక నాకు సెల విప్పించాలి!" అన్నాడు లక్ష్మణన్.

"థాంక్యూ!" అంటూ మహేంద్ర లేచాడు. ఛటర్జీ వాకిలిదాకా వచ్చి కారిడార్‌లో చివర నిలబడిన సి.ఐ.డి.కి ఒకకంట కనిపెట్టి వుండమని సంజ్ఞ చేశాడు. రెండువేపులా వున్న గదుల మధ్యగా నడుస్తూ ఇద్దరూ మెట్లదాకా వచ్చారో లేదో లక్ష్మణన్ గదిలోంచి పిస్టల్ ప్రేలిన శబ్దమూ, ఆ తర్వాత యువతి ఆక్రందనం వినిపించినయ్.

హఠావిడిగా ఇద్దరూ వెనక్కు పరుగెత్తుకొచ్చారు. అయితే గది తలుపు లోపల గడియవేయటం వలన తలుపు తెరవటానికి వీలుకాలేదు.

ఛటర్జీ వెనక్కు వెళ్ళి, ఒక్క వుదుటున తలుపు ఢీకొన్నాడు. తలుపు విరిగి లోపలకు పడింది.

గదిలో బెడ్‌మీద లక్ష్మణన్ రక్తపు మడుగులో పడి వున్నాడు. అతడి ఛాతీలోనూ, పొట్టలోనూ బుల్లెట్ గాయాలు కనబడుతున్నయ్.

అంతక్రితం కనుపించిన కాశ్మీర్ యువతి జాడలేదు.

మహేంద్ర గది నాలుగువేపులా గాలించాడు. యువతి దాక్కోవడానికి ఎటువంటి రహస్యపు చోటూ కనబడ లేదు.

కిటికీలోంచి క్రిందకు చూశాడు. కిటికీలోంచి చూస్తే క్రింద ఏదో సన్నని వీధి పోతోంది. ఆ వీధిలో అట్టే జనం నడవడం లేదు.

హంతకుడెవరో ఈ కిటికీలోంచే వచ్చి వుండాలి. అటు

ప్రక్క వీధిలో అట్టే జనసంచారం లేదు గనుక ఆత డ్నెవరూ గమనించేందుకు గూడ ఆస్కారం లేదు. అయితే ఆ యువతినిగూడ హంతకుడు లాక్కుపోయాడా?

కిటికీలోంచి బాగా క్రిందకు వంగి చూశాడు. బాహాటంగా పడుతున్న మంచులో గాజు స్ఫటికంలోంచి కనుపించినట్టుగా, అప్పుడే పడిన మంచు పొరలోంచి గోడమీద ఎవరివో పాదాల గుర్తులు కనబడుతున్నయ్.

ఆ గుర్తుల్ని ఛటర్జీకి చూపించాడు మహేంద్ర. "ఏదైనా త్రాటినిచ్చైన ఉపయోగించి పైకి వచ్చి, మళ్ళీ ఆ దారినే హంతకుడు వెళ్ళిపోయి వుంటాడు."

"అవునవును. ఈ గదికి సూటిగా క్రిందవున్న గదిలో ఎవరు బసచేశారో కనుక్కోవాలి."

ఇద్దరూ రిసెప్షన్ లోకి పరుగుతీశారు. మెట్లన్నీ దిగి, జనాన్ని త్రోసుకుంటూ, నెట్టుకుంటూ దారిచేసుకుని వెళ్ళేసరికి పావుగంట పైగానే పట్టింది.

"చూడండి! మూడో అంతస్తులో పదహారో నెంబరు గదికి నేరుగా క్రింద అంతస్థులో వున్న గది నెంబరెంత?"

"ఆ గది నెంబరు ముప్ఫయి ఎనిమిది సార్!" రిసెప్షనిస్టు నవ్వుతూ జవాబిచ్చింది.

"ఆ గదిలో ఎవరున్నారు?"

"వాళ్ళు ఇంతకుముందే, పదినిమిషాల క్రితం గది ఖాళీ చేసి వెళ్ళిపోయారు సార్!"

"ఈజ్ ఇట్! అయితే వాళ్ళ అడ్రసు వెదికి ఇవ్వాలి! చాలా అర్జెంట్!" మహేంద్ర ఆదుర్దాగా అడిగాడు.

రిసెప్షనిస్టు కిలకిల నవ్వింది. ఆమె నవ్వుచూస్తే మహేంద్రకు అరికాలిమంట నెత్తికెక్కింది.

"శ్రీనగర్ లోకల్లా పెద్ద హార్డ్ వేర్ ఇండస్ట్రియల్

మల్ హోత్రా తెలుసా! ఆయన మేనల్లుడు రాకేష్, ఆయన భార్యా పేరిట ఆ గది రిజర్వ్ చేయబడింది."

"అలాగా! రాకేష్ వెంట మరో కాశ్మీరీ యువతి కూడా వుందా?"

"లేదండి. కాశ్మీరీ యువతి ఎవరూ లేరు. ఆంగ్లో ఇండియన్ అమ్మాయి మాత్రమే వుంది."

తమకు కాశ్మీరీ యువతిలా కనపడిన వ్యక్తే వేషం మార్చుకుని వుండాలనుకున్నాడు మహేంద్ర. ఆమెకూడ హంతకుడి తరఫు మనిషి అనటానికి సందేహంలేదు. లక్ష్మణన్ ని సుఖపెట్టటానికి వచ్చిన స్త్రీలా అతడి గది లోకి ప్రవేశం సంపాదించి, అతడ్ని తుదముట్టించటానికి హంతకుడికి సాయపడిందన్నమాట.

6

"ముందుగా మనం మల్ హోత్రాని ఇంటర్వ్యూ చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం!" మహేంద్ర అడిగాడు.

"బాగానే వుంది! కాని రేపు సమావేశంలో ఏం గొడవలు జరుగుతాయో! దానికి మరింతగా కట్టుదిట్టం చెయ్యాలి గదా!"

"అదెంత పని! పోతూ పోతూ లాల్ ని కలుసుకుని అతడికి ఆ పని పురమాయించి మనం మల్ హోత్రా దగ్గరకు పోదాం!"

"ఓ కే!"

కారు ముందుకు సాగింది. లాల్ కి ఇవ్వాల్సిన సూచన లిచ్చి మల్ హోత్రా ఆఫీసు ముందు ఆగారు.

అందంగా అలంకరించబడిన గదిలో రోజ్ వుడ్ టేబుల్ ముందర కూర్చుని ఏవో కాగితాలు చూసుకుం టున్నాడు మల్ హోత్రా.

సాదరంగా ఆ వచ్చిన వ్యక్తుల్ని ఆహ్వానించాడు మల్హోత్రా.

"నా వల్ల మీకే సహాయం కావాలో అడగండి!" అన్నాడు.

మహేంద్ర క్లుప్తంగా తాము వచ్చిన పని వివరించాడు.

"అటు పోలీసు ఉన్నతాధికారి, ఇటు సి. ఐ. డీ. ఉన్నతాధికారి ఇద్దరూ వచ్చారంటే ఏదైనా డొనేషన్ కోసం వచ్చారేమో అనుకున్నాను. లక్ష్మణన్ హత్య గురించే నాకు తెలీదు!"

ఛటర్జీ మల్హోత్రా కళ్ళలోకి సూటిగా చూస్తూ, అతడి ముఖంలో రంగుల్ని గమనించటానికి ప్రయత్నించాడు. కాని మల్హోత్రాలో ఏ విధమైన ఉద్వేగమూ కనబడలేదు.

కాలింగ్ బెల్ నొక్కి ప్యూన్ని రప్పించాడు. ఫ్రిజిడేర్లోంచి బ్రాందీ బాటిల్ తీశాడు ప్యూన్. గ్లాసుల్లోకి సీసాలోని బ్రాందీని వంచాడు.

"లక్ష్మణన్ దక్షిణ భారతంలో పెద్ద స్టీల్ వ్యాపారస్థుల్లో ఒకడు. అతడు చనిపోతే, మా వ్యాపార రంగంలో ఒక ధృవతార రాలిపోయినట్లే!"

"లక్ష్మణన్ గదిలోంచి మేము అప్పుడే బయటకు వచ్చాం. లోపల్నుంచి రివాల్వర్ షాట్ వినిపించింది. తిరిగి వెళ్ళి చూస్తే లక్ష్మణన్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఆ గది కిటికీలోంచి హంతకుడు పారిపోయి ఉండాలని రూఢి అయింది. పై అంతస్థు గదిలోంచి క్రింది అంతస్థు గదిలోకి దిగినట్లుగా అడుగుజాడలుగూడా వున్నాయి. ఆ క్రింది గదిలోకి మీ మేనల్లుడు రాకేష్, అతడి భార్యతోసహా దిగినట్లు ఆరాలో తేలింది."

మల్హోత్రా ఆశ్చర్యంగా చూశాడు. "ఏమిటీ?

రాకేష్ భార్యా?"

"అవును!"

"మీరు పొరబడి ఉంటారు. రాకేష్‌కి ఇంకా వివాహం కాలేదు. పైగా వాడ్ని మా ఫ్యాక్టరీకి పంపాను రెండు రోజుల క్రితం."

"అంటే మీవాడి పేరు మీద మరెవరో ఆ గదిలో దిగాడంటారా!"

"ఆ మాట వేరే చెప్పాలా సార్! లక్ష్మణన్ హత్య వార్త వింటూనే నాకు చాలా విచారం కలిగింది. ఎందుకంటారా? ఈ నెలలో అతడు మా కంపెనీనుంచి ఇనుప కమ్ముల్ని కొంటానికి వస్తానన్నాడు. దాదాపు మూడు నాలుగు లక్షల రూపాయలు విలువచేసే ఆర్డరు. అతడి మరణంతో ఆ ఆర్డరు మేం నష్టపోయినట్టే!" డ్రాయర్ లాగి ఒక ఫైలు తీసి వాళ్ళ ముందుంచాడు మల్‌హోత్రా.

ఇద్దరూ ఆ ఫైల్‌లో లక్ష్మణన్ వ్రాసిన లెటర్స్ చదివారు. మల్‌హోత్రా చెప్పింది నిజమే!

"నా మేనల్లుడు రాకేష్‌ని ఎవరో అనుకరిస్తున్నారంటే, ఒక విధంగా రాకేష్‌కి కూడ వాళ్ళు ఏదైనా అపాయం తలపెట్టవచ్చు. కనుక నా మేనల్లుడ్ని కూడ కాపాడవలసిన బాధ్యత మీ మీద ఉంచుతున్నాను. దయచేసి మీరు నాకే సాయంచేయాలి" అన్నాడు మల్‌హోత్రా దీనంగా.

"మా శాయశక్తులా ప్రయత్నించి నిర్దోషులకు రక్షణ, దుర్మార్గులకు తగిన శిక్షా ఇచ్చే ఏర్పాటుచేస్తాం. సరేనా?" అంటూ అతడికి హామీ ఇచ్చాడు మహేంద్ర.

"మీ సమాచారానికి చాలా థ్యాంక్స్! వస్తాం!"

మహేంద్ర, ఛటర్జీ, మల్‌హోత్రా దగ్గర సెలవు తీసుకుని బయటకు నడిచారు.

7

మరునాటి వరకూ ఎలాంటి సంఘటనలు లేకుండానే గడిచింది.

ఆ రోజు అలీన రాజ్యాల సభ జరుగవలసి వుంది. సభలో నేపాల్, బర్మా, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక మొదలైన దేశాల ప్రతినిధులు ఉపఖండంలో శాంతి స్థాపన గురించి చర్చిస్తారు.

అగ్ర దేశాల ప్రతినిధులెవరూ ఈ సభకు రావటంలేదు. అందువలన భారీ ఎత్తున రక్షణ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం లేకపోయింది. అయినా ఛటర్జీ, మహేంద్ర ఇద్దరూ అప్రమత్తతగా ఉన్నారు.

ఛటర్జీకి సెంట్రల్ ఆఫీసునుంచి ఫోన్ రావటం వలన, మరునాడు జరగబోయే ఆఖరి సమావేశానికి ఏర్పాట్ల గురించి మాట్లాడడం కోసం సమావేశ మందిరంనుంచి బయలుదేరాడు.

మహేంద్ర అలీనరాజ్యాల సభకు కాపలాగ ఉండిపోయాడు. అతడి క్రింద పనిచేసే డి.యస్.పీలూ, యస్.ఐ.లూ అతి జాగ్రత్తగా అందర్నీ వెయ్యికళ్ళతో కనిపెడుతున్నారు.

ఛటర్జీ కారు వేగంగా నడుపుతున్నాడు. రోడ్డుమీద ఒక ప్రక్కగా కారు ఆగి ఉంది ఒకచోట. దాని ప్రక్కనే ఒక యువతి నిలబడి చెయ్యి ఊపుతోంది.

కారుని ఆమె దగ్గరగా ఆపాడు ఛటర్జీ. "నేను మీకే విధంగా సాయపడగలను మాడమ్!" అని అడిగాడు.

"నా కారు టైరు పంచరయింది. దయచేసి సిటీలోకి లిఫ్ట్ ఇవ్వగలరా?" ఆమె అడిగింది.

ఛటర్జీ డోర్ తెరిచాడు. ఆమె లోపలకు ఎక్కి

కూర్చుంది. కారు తిరిగి వేగం పుంజుకుంది.

"మీరు చాల వేగంగా నడుపుతారు! నాకు అంత వేగంగా నడపాలంటే చచ్చేభయం!" అంది ఆమె నవ్వుతూ.

ఛటర్జీ ఆమెవంక చూశాడు. ఆమె తెల్లగా, బొద్దుగా వుంది. ఆమె వయసు పాతిక సంవత్సరాలు వుండచ్చు అనుకున్నాడు.

ఆమె మెచ్చుకున్నందుకు కారు స్పీడ్ తగ్గించాడు ఛటర్జీ.

"అరె! ఏదో కారు ఎదుగొస్తున్నట్టుంది. ఈ మంచులో తీరా దగ్గరకు వచ్చేదాకా తెలీదు!" అంది ఆమె.

ఎదురుగా వస్తున్న కారుని తప్పుకునే యత్నంలో ఛటర్జీ స్టీరింగ్ ప్రక్కకు త్రిప్పాడు.

తనవంక చూడటంలేదని రూఢిచేసుకుని ఆ యువతి చేయి బయటకు పెట్టి, ఏదో చిన్న వస్తువుని కారు క్రిందకు విసిరింది.

ఆ వస్తువు మీదుగా వెనుక చక్రం పడంగానే "ఢాం!" అంటూ పెద్ద మ్రోత వినిపించింది.

"ఏమిటది?" అంటూ ఛటర్జీ బ్రేక్ వేసి కారాపాడు. దిగి చూస్తే వెనుక టైర్ బరస్ట్ అయివుంది.

"చచ్చాం పో! ఇప్పుడెలాగ?" అన్నాడు.

"ఏంచేస్తాం! నా దురదృష్టం మిమ్మల్నీ ఇబ్బందిలో పెట్టినట్టుంది" ఆ యువతి ఇబ్బందిగా అంది.

"ఫరవాలేదు లెండి! ఏదైనా కారు ఈ రోడ్డమ్మట రాకపోతుందా?"

"బయట మంచుగా వుంది! లోపలకువచ్చి కూర్చోండి!"

ఛటర్జీ డోర్ తెరుచుకుని లోపలకు వచ్చాడు.

"అబ్బ! ఏంచలి!" అంటూ ఆమె అతడికేసి జరిగింది.

ఛటర్జీ మెడచుట్టూ చేతులువేసి అతడ్ని మీదకు లాక్కుంది.

8

కారిడార్లో అటూ ఇటూ పచార్లుచేస్తున్న మహేంద్ర ఆ చివరగా తారట్లాడుతున్న వ్యక్తిని చూసి ఉలిక్కి పడ్డాడు.

అతడు అచ్చం 'బులుంగా' లాగే ఉన్నాడు. చచ్చిపోయిన బులుంగా మళ్ళీ బ్రతికి వచ్చాడా అన్నట్టుగా అనిపించింది.

వడవడిగా అడుగులు వేసుకుంటూ అతడ్ని అనుసరించాడు.

పొట్టిగా వున్న ఆ వ్యక్తి గబగబ ముందుకు నడిచి మలుపు తిరిగి అక్కడున్న గదుల్లో మాయమయ్యాడు. మహేంద్ర అటూ ఇటూ వెదుకుతూ లోపలకు వెళ్ళాడు. అతడు దాటిన గదుల తలుపులు ఒకటొకటే అతడి వెనుకనే మూసుకుపోవటం అతడు గమనించలేదు.

ఎంతగా ముందుకు వెళ్ళినా ఆగంతకుడి ఆచూకీ దొరకలేదు.

నేలమీద అగ్గిపెట్టెకన్న చిన్న సైజులో ఏదో ఆకుపచ్చని పెట్టె కనబడింది. మహేంద్ర వంగి దాన్ని జేబుగుడ్డతో అందుకున్నాడు.

అతి జాగ్రత్తగా దాన్ని తెరవటానికి ప్రయత్నించాడు, నాలుగైదు నిముషాలు శ్రమపడ్డాక అది తెరుచుకుంది.

"ఢాం!" అనే పెద్ద శబ్దం వినబడడంతో మహేంద్ర చేతిలోని వస్తువుని వదిలేశాడు.

అయితే మరుక్షణంలో ఆ ప్రేలుడు ఆ వస్తువునుంచి రాలేదనీ, సభాభవనంలో ఎక్కడో బాంబు ప్రేలిందనీ గ్రహించేసరికి అతడికి ముచ్చెమటలు పోసినయ్.

వెనక్కు తిరిగి బయటకు పోవటానికి ప్రయత్నించాడు. అతడి ఆశ్చర్యానికి అంతులేదు. తను వచ్చిన దోవ తలుపులు గట్టిగా బంధించబడి ఉన్నయ్. ముందుకు దారిలేదు. వెనక వేపున తలుపులు వేసేసి వున్నాయ్. ఆ గదిలో కిటికీలు గూడ లేవు, కనుక తను అరిచినా ఆ కేకలు ఎవరికీ వినపడవు.

అంతలో తలుపులు తెరుచుకున్నాయ్. ఎవరో ఇన్‌స్పెక్టర్ తలుపు తెరిచాడు. కారిడార్‌లోంచి జనం గుంపులు గుంపులుగా పారిపోతున్నారు.

"మీరిక్కడున్నారా సార్! సభాభవనంలో ఎవరో బాంబు విసిరారు, ప్రేలుడు సంభవించింది, ఫైర్ స్క్వాడ్‌కి ఫోన్ చేశాం!" అన్నాడతడు.

"డెలిగేట్స్‌లో ఎవరికైనా ప్రమాదం సంభవించిందా?" ఆదుర్దాగా అడిగాడు మహేంద్ర.

"నేపాల్ ప్రతినిధికి గాయాలయినయ్. ప్రేక్షకుల గ్యాలరీలో ఇద్దరు వ్యక్తులు చనిపోయారు."

మహేంద్ర హుటాహుటిగా ముందుకు నడిచాడు.

బయట కోలాహలంగా వుంది భవనంలోంచి అరుస్తూ, ఏడుస్తూ పారిపోతున్న జనంతో. సమావేశ మందిరం పొగతో నిండిపోయింది. కొన్ని కొయ్య కుర్చీలు మండుతున్నయ్. ఆ మంటలు ఎలా వచ్చాయో అర్థంకాలేదు మహేంద్రకు.

ఎవరో సెక్యూరిటీ ఆఫీసరు పెద్దగా ప్రమాదం గురించి వివరిస్తూన్నాడు. ముందు పెద్దగా బాంబు ప్రేలుడు విని

పించింది. కిటికీల అద్దాలు పగిలిపోయి గాజు పెంకులు చెల్లా చెదురుగా పడిపోయాయి. ఆ సాయంత్రం వరకూ ప్రశాంతంగా వున్న వాతావరణం క్షణాల్లో భీభత్సంగా తయారయింది.

పారిపోతున్న జనంలో బలంగా లాంటి వ్యక్తి లెవరయినా వున్నారేమో పరీక్షగా వెదికాడు మహేంద్ర. కాని అంగామీ జాతివాళ్లెవరూ లేరు.

అయితే అతని కళ్ళకు మల్‌హోత్రా మేనల్లుడు రాకేష్, అతని వెంట మరో అమ్మాయి కనుపించారు. వాళ్ళు లోపలకు ఎలా రాగలిగారా అని ఆశ్చర్యపోయాడు మహేంద్ర.

ఇన్స్‌పెక్టర్‌ని పిలిచి రాకేష్‌ని చూపించి, అతణ్ని వెంటాడమని చెప్పాడు.

అంతలో ఎవరో అరిచారు "అమ్మో మంటలు! భవనం కాలిపోతున్నది!"

లోపలున్న వ్యక్తులు తలా ఒక దిశగా పారిపోతున్నారు. మంటలు నలువైపులా అలుముకుంటున్నయ్. బయట మంచు కురుస్తుంటే లోపల మంటలు!

మహేంద్ర ముందుకు వెళ్ళటానికి వీల్లేకుండా మంటలు ఎగ్రబాకినయ్. ప్రక్కనే ఉన్న ఇన్స్‌పెక్టర్‌ని సాయంగా పట్టుకుని గోడకానుకుని ప్రక్క ప్రక్కగా అవతలవేపుకి పరుగెత్తాడు. కాలే పెనంమీద కూర్చున్నట్టుగా సెగ కొట్టింది అతడికి. అలాగే ముందుకు దూసుకుపోయాడు గుడ్డిగా. అతడి చేతులు మంటలకు తగిలి బాధపెట్టినయ్.

ఆ భవనంలో ఒక మూలగా పైకప్పు కూలి క్రిందబడింది. కూలిపోయిన శిథిలాల క్రింద ఇరుక్కున్న వాళ్ళనూ, మంటల్లో కాళ్ళూ చేతులూ కాలినవాళ్ళను ఫైర్ సర్వీసు వాళ్ళు వచ్చి వెలికి తీసి అంబులెన్స్‌లో హాస్పిటల్‌కి చేర్చారు.

ఛటర్జీ భవనం ముందు నిలబడి తన జూనియర్ ఆఫీసర్లకు ఆదేశాలిస్తున్నాడు.

"ఏమిటి సంగతి! నీవు అయిపులేకుండా పోయావు!" మహేంద్ర అడిగాడు.

"నన్ను కావాలనే ఎవరో దోవలో ఆటంకపరిచి ఆపారు మిస్టర్ మహేంద్రా!"

"మళ్ళీ అంగామీ జాతివాడు ప్రత్యక్షమయాడు ఇక్కడ ఈ ఘోరం సంభవించటానికి ముందు! అది వాడి పనే అయిఉండాలి. అంతేకాదు. రాకేష్, మరో అమ్మాయి గూడ ఈ సమావేశానికి వచ్చారు. వాళ్ళా అనుమాని తులే నా దృష్టిలో" మహేంద్ర తన అనుమానాన్ని వివరించాడు.

పోలీసు ఇన్స్పెక్టర్ తిరిగి వచ్చాడు. "సర్! ఇంత క్రితమే మల్హోత్రా బంగళానుంచి కారులో మల్హోత్రా, రాకేష్, అతని వెంట వున్న అమ్మాయి ముగ్గురూ వెళ్ళిపోయారు. ఇంట్లో ఆరా తీయగా వాళ్ళు ఇక్కడకు పది మైళ్ళ దూరంలో వున్న తమ ఎస్టేట్‌కి వెళ్ళారని తెలిసింది."

"గుడ్! మనంగూడ ఇప్పుడే వెళ్ళి వాళ్ళ సంగతేమిటో తేల్చుకుందాం!" మహేంద్ర ఉత్సాహంగా అన్నాడు.

ఛటర్జీ 'సరే'నన్నాడు.

9

శ్రీనగర్ పట్టణ పొలిమేరల్లో రెండు జీపులు వేగంగా పోతున్నయ్. మంచులో జీప్ చక్రాలు జారిపోకుండా బెల్ట్‌లాంటి చైన్‌లు వేయబడినయ్ చక్రాలకు.

ముందు జీప్‌లో మహేంద్ర, ఛటర్జీ కూర్చుని వున్నారు. వెనుక రెండో జీప్‌లో మరికొందరు గూఢచారి శాఖ

ఉద్యోగులూ, మంచులో జారిపోయేటందుకు వీలుగా వుండే స్కేటింగ్ సాధనాలు, త్రాళ్ళూ, లాటీకర్రలు, మెషీన్ గన్స్, మెడికల్ కిట్ ఇవన్నీ వస్తున్నయ్.

శ్రీనగర్ కు పది మైళ్ళ దూరంలో చిన్న పల్లెకు దగ్గరగా మల్హోత్రా ఎస్టేట్ వుంది.

మంచు కొద్దిగా పడుతోంది. జీప్‌లు మైదానాల మధ్యగా వెడుతోన్నయ్. ప్రకృతి మీద తెల్లని గుడ్డ పరచినట్టుగా ఎటు చూసినా తెల్లని మంచు కప్పబడిన బీళ్ళూ, మైదానాలూ, గుట్టలూ కనబడుతున్నయ్.

ఒక గంట ప్రయాణించిన తర్వాత రెండు జీప్‌లు ఒక పెద్ద బ్రిడ్జివద్దకు చేరుకున్నయ్. ఏదో చిన్ననది పారుతోంది బ్రిడ్జి క్రిందుగా.

"ఇంకా ఎంత దూరం ఇక్కడనుంచి?" మహేంద్ర అడిగాడు.

"అదుగో ఆ కనబడే కొండ మలుపు తిరిగితే అతగాడి ఎస్టేట్ వస్తుంది" ఛటర్జీ బదులు చెప్పాడు.

మహేంద్ర ఫ్లాస్క్ తెరిచి టీ పోసుకుని త్రాగాడు. ఛటర్జీ తనకు ప్రస్తుతం ఏమీ అక్కర్లేదన్నాడు.

జీప్‌లు మళ్ళీ కదిలినయ్. మొదటి జీప్ బ్రిడ్జిమీద సగందూరం దాటి వచ్చింది. జీప్‌కి పదిగజాల దూరంలో 'ఢాం' అంటూ బాంబు ప్రేలింది. బ్రిడ్జిలో కొంతభాగం కూలిపోయింది నదిలోకి. అక్కడ అగాధం ఏర్పడింది.

జీప్ నడుపుతున్న ఛటర్జీ ప్రమాదాన్ని గ్రహించి సడన్ బ్రేక్ వేశాడు. కాని జీప్ కొంచెం ముందుకు వెళ్ళి ఆగింది. అప్పటికే జీప్ ముందు చక్రాలు కూలిపోయిన వంతెన ఖాళీలోకి దిగబడిపోయినై. మరుక్షణంలో జీప్ ముందుకు తూలి పడిపోయింది.

సుడులు తిరుగుతూ, పరవళ్లు త్రొక్కుతూ, మీగడలా పైభాగాన పేరుకున్న మంచుగడ్డలు నీళ్ళమీద తేలుతూ ప్రవాహంలోకి పోతున్న నది తమని కబళించే నెపంతో వాళ్ళమీదకు వురుకుతున్నదా అన్నట్టుగా అనిపించింది, పడిపోతున్న జీప్‌లోని వ్యక్తులకు.

మహేంద్ర, ఛటర్జీ ఇద్దరు జీప్‌లోంచి చెరోవేపుకూ దూకేశారు.

నీళ్ళలో మునిగిపోతున్న వ్యక్తులకు పైనుంచి అరుపులు వినిపిస్తున్నయ్. బరువుగా వున్న జీప్ నీళ్ళలో మునిగి పోయింది. ఆ తర్వాత వ్యక్తులు నీళ్ళలోకి జారారు.

నీటిపైభాగం వాళ్ళిద్దర్నీ కప్పేసింది. ఎముకలు కొరికే చలి. తన నరాలు చచ్చుపడిపోతున్నాయా అనుకున్నాడు మహేంద్ర. తన బలాన్నంతా కూడగట్టుకుని కాళ్ళూ చేతులతో నీళ్ళలోనే తన్నుకున్నాడు. మీగడలా వున్న పైభాగం అడుగున, నీరు వేగంగా ప్రవహిస్తోంది. ఆ ప్రవాహంలో మునుగుతూ తేలుతూ ముందుకుపోతున్నాడు. అలుపుతో నోరు తెరిస్తే నోట్లోకి నీళ్లు పోయినయ్.

అంతలోనే అతడికి తాడులాంటిదేదో చేతికి దొరికింది. రెండు చేతులతో దాన్ని గట్టిగా పుచ్చుకున్నాడు. ప్రవాహం వాలులో అతడు కొట్టుకుపోకుండా ఆగగలిగాడు.

తాడు బ్రిడ్జివేపునుంచి లాగబడుతోంది. నీళ్ళమీదకు తేలి పైకిచూచాడు మహేంద్ర. రెండో జీప్‌లో వచ్చిన సీక్రెట్ ఏజెంట్స్ జరిగిన ప్రమాదాన్ని గ్రహించి నీళ్ళలోకి తాళ్లు విసిరారు.

తాడు సాయంతో వంతెనమీదకు ఎక్కుదామని ప్రయత్నించాడు. కాని చలికి కాళ్ళూ చేతులూ కొంకర్లు

పోయి అతడి స్వాధీనంలోకి రాలేదు. అలాగే తాటిని తన నడుంచుట్టూ చుట్టబెట్టుకుని పైకి లాగమని అరిచాడు. చటర్జీనిగూడ అలాగే రక్షించారు.

జీప్ లోంచి అల్యూమినియం నిచ్చెనలను వంతెనమీద ఏర్పడిన అగాధంమీద పరిచారు. అవి అల్యూమినియంతో చేయబడినాగాని ఇనుముకన్న గట్టివి. వాటిమీదుగా రెండో జీప్ ని వంతెన దాటించారు.

మహేంద్ర తడిబట్టలు విప్పేసి, రెండు రగ్గులు కప్పుకుని జీప్ లో కూర్చున్నాడు.

కొండకు ఇవతలగా, వంతెననుంచి మైలుదూరంలో ఏదో ఇల్లు కనబడుతోంది. అక్కడున్న పల్లెలో అదే మొదటి ఇల్లు. అక్కడకు తీసుకువెళ్ళి ఇద్దరికీ మెడికల్ ఎయిడ్ ఇవ్వాలని నిర్ణయించబడింది.

సీక్రెట్ ఏజంట్ వెళ్ళి ఆ ఇల్లు తలుపు తట్టాడు.

తలుపు తెరుచుకుని ఆజానుబాహువులాంటి వ్యక్తి బయటకు వచ్చాడు.

"ఇద్దరు వ్యక్తులు ప్రమాదస్థితిలో వున్నారు. వాళ్ళకు విశ్రాంతి కావాలి!" అన్నాడు అతడు.

"కాని మా ఇంట్లో వాళ్ళకు కావల్సిన సదుపాయాలేం లేవు."

"అదంతా మేం చూసుకుంటాం! ముందు లోపలకు రానివ్వండి" అంటూ అతడు ఆ ఇంటిలోని వ్యక్తిని నెట్టుకుంటూ లోపలకు వెళ్ళాడు.

అతడి వెనుకనే మిగతావాళ్ళు లోపలకు ప్రవేశించారు మహేంద్ర, ఛటర్జీలను నడిపించుకుంటూ.

లోపల రెండు బెడ్స్ ఏర్పరచి వారిని పడుకోబెట్టారు. ఫ్లాస్క్ వంచి వేడివేడి టీ త్రాగించారు.

వీళ్ళవంక గుర్రుగా చూస్తూ, అసహాయంగా నిలబడి పోయాడు ఇంటి యజమాని. వీళ్ళంతా తన ఇంటికి రావడం అతడికి సుతరామూ ఇష్టంలేదని అతడి చూపులే తెలుపుతున్నయ్.

మధ్యమధ్యలో అతడు లోపలకు వెళ్ళివస్తున్నాడు. అతడుకాక ఆ ఇంట్లో మరెవరో ఉన్నట్టుగావుంది. వాళ్ళ వునికిని ఆగంతకులు చూడటం తగదన్నట్టుగా అతడు ఆదుర్దా పడుతున్నాడు.

అరగంట గడిచేసరికి ఛటర్జీ, మహేంద్రలు మళ్ళీ మామూలు మనుష్యులయారు.

"లావెట్రీ ఎక్కడ?" అని అడిగాడు ఛటర్జీ ఇంటి యజమానివంక చూస్తూ.

"ఇటు వెళ్ళండి!" అంటూ దోవ చూపించాడు.

ఛటర్జీ లావెట్రీకి వెళ్తూ లోపల గదిలో ఒక యువతిని చూసి ఆశ్చర్యపోయాడు. ఆమె ఎవరోకాదు. కారులో తనని అటకాయించిన యువతే. ఆమె ఇక్కడికెలా వచ్చింది?

అయినా ఆమెను గమనించనట్లుగా లావెట్రీలోకివెళ్ళి తలుపు వేసుకున్నాడు.

ప్రక్కగదిలోంచి ఆ యువతి ఏదో ట్రాన్సిమిటర్ లోనో లేదా ఫోన్‌లోనో మాట్లాడుతున్నట్టుగావుంది, సన్నగా మాటలు వినబడుతున్నయ్.

"వెంటనే నలుగుర్ని పంపండి! లేదా మేమిక్కడే వాళ్ళ చేతుల్లో బందీలయిపోతాం. బ్రిడ్జి సరిగా టైమ్‌కే ప్రేలింది. అయినా వాళ్ళెలా తప్పించారో అర్థంకావటం లేదు!"

ఇంకా ఏమో చెప్పబోతున్న ఆమెను ఇంటి యజమాని

వచ్చి వారించాడు. లావెట్రీలోకి మనిషి వెళ్ళాడన్నట్టుగా సైగచేశాడు. ఆ యువతి తన చేతిలోని పాకెట్ సైజు ట్రాన్సిస్టర్ ని దాచేసింది.

ఛటర్జీ లావెట్రీలోనుంచి బయటకువచ్చి మహేంద్రకు రహస్యంగా చెప్పాడు. కొద్దిసేపట్లో తమమీద దాడి జరగవచ్చని.

మహేంద్ర చిరునవ్వు నవ్వాడు. "కుందేలు పొదలోకి దూరిందన్నమాట" అన్నాడు.

ఏమీ గ్రహించనట్టుగా అందరూ కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్న వాళ్ళకు మళ్లే ఇంటి యజమాని ఇచ్చిన విస్కీ తాగసాగారు.

అయిదు నిముషాలు గడిచేసరికి బయట ఏదో జీప్ ఆగిన చప్పుడు వినిపించింది.

సీక్రెట్ ఏజెంట్ ఒకడు కిటికీలోంచి బయటకు చూశాడు.

జీప్ లోంచి అంగామీజాతి వ్యక్తులు నలుగురు దిగారు. వాళ్ళ చేతుల్లో మెషిన్ గన్స్ వున్నయ్.

అతడి కంగారు చూసి మహేంద్ర 'ఏం భయంలేదు, మాట్లాడకుండా ఊరుకో!' అన్నట్టుగా సైగచేశాడు.

అతడు కిమ్మనకుండా కూర్చుండిపోయాడు.

అంగామీలు లోపలకు వస్తూనే గాలిలోకి ఒకసారి పేల్చారు తుపాకుల్ని బెదిరింపుగా.

లోపలున్న వ్యక్తులవంక చూస్తూ "ఎవరికీ హాని తల పెట్టడం మా అభిమతంకాదు. ఈ ఇంట్లోవున్న అమ్మాయీ ఆమె తండ్రీ మాకు తీరని ద్రోహం తలపెట్టారు. మర్యాదగా వాళ్ళను మాకు అప్పజెప్పండి. లేదా మీ అందర్నీ హతమార్చి అయినా వాళ్ళని తీసుకుపోతాం!" అన్నాడు

అంగామీలలోని ఒక వ్యక్తి.

"అయ్యో! పాపం! ఆడది! ఆ యువతిని దయదలిచి వదిలెయ్యండి. కావాలంటే ఇంటాయనను పట్టుకుపొండి!" అన్నాడు ఛటర్జీ.

"ఆదేంకుదరదు! మాకు ఆ అమ్మాయె మరీ ముఖ్యం!" అన్నాడు అంగామీ.

మరో ఇద్దరు అంగామీలు లోపలకు జొరబడి, ఆ యువతినీ ఇంటి యజమానినీ గన్స్ గురిపెట్టి బెదిరించి బయటకు లాక్కొచ్చారు.

ఆ యువతి "అయ్యయ్యో! నన్ను రక్షించండి. ఈ దుర్మార్గులు నన్ను చెరచి, నానాహింసలు పెట్టిగాని ప్రాణాలు తీయరు!" అంటూ గోలుగోలున ఏడ్వసాగింది.

అయినా తాము అశక్తులమయినట్టూ, ఏం చేయలేక పోయినట్టుగా మహేంద్ర, ఛటర్జీ అలాగే నిలబడి పోయారు.

ఆ యువతినీ, ఆమె తండ్రినీ జీప్‌లో ఎక్కించారు అంగామీలు. ఆ తర్వాత జీప్ కదిలింది.

వాళ్ళ జీప్ రెండు ఫర్లాంగులు పోంగానే, మహేంద్ర ఛటర్జీ అతడి పరివారం అందరూ రెండు జీపుల్లో ఎక్కి హుటాహుటిని అంగామీల జీప్‌ని వెంబడించసాగారు.

అంగామీల జీప్ వేగంగా ముందుకు పోతున్నది. దాని వెనుకగా నాలుగైదు ఫర్లాంగుల దూరంలో పోలీస్ జీప్‌లు పరుగెడుతున్నయ్.

జీప్‌లోంచి దిగిన నలుగురు అంగామీలు మిగతా వాళ్ళతో కలసి బంగాళాలోకి కాల్పులు చేయసాగారు.

మహేంద్ర, ఛటర్జీ తను పరివారంతో మెషీన్‌గన్స్‌కి పని చెప్పారు.

ముందువేపు బంగళాలోంచి కాల్పులు. ఇటు వెనుక నుంచి హఠాత్తుగా అనుకోకుండా వచ్చిన మరో జట్టు శత్రువుల కాల్పులు. ముందునుయ్యి, వెనుక గొయ్యిలా అయిపోయింది అంగామీలపని. ఒక్కొక్కరే తుపాకి గుళ్ళ వర్షంలో అంగామీలు నేలకు ఒరిగారు.

అందరూ చనిపోయారని, నిర్ధారణ చేసుకున్నతర్వాత మహేంద్ర, ఛటర్జీలు బంగళా వేఫుగా నడిచారు.

బంగళాలోంచి మల్‌హోత్రా చేత్తో మెషీన్‌గన్‌ని అలానే పుచ్చుకుని బయటకు వచ్చాడు.

"మీ సహాయానికి కృతజ్ఞుడ్ని. సమయానికి మీరే రాకపోతే నాపని ఈ రోజుతో ఆఖరయి వుండేది" అంటూ వాళ్ళను అభినందించి లోపలకు తీసుకుపోయాడు.

"అంగామీలు మీపై దాడిచేయటానికి గల కారణం ఏమైవుంటుందంటారు?" మహేంద్ర అడిగాడు.

"అదే నాకూ అర్థం కావటంలేదు! ఆఁ! ఒకటైవుండ వచ్చు! ఇక్కడ ప్రేలుడు సామాను భద్రపరచబడింది. బహుశా దాన్ని స్వాధీనపరచుకోవాలని వచ్చివుండ వచ్చు" మల్‌హోత్రా బదులు చెప్పాడు.

"అంత పెద్ద మొత్తంలో మందుగుండు సామాను మీ దగ్గర దేనికి వుంచుకున్నారు?" ఛటర్జీ అడిగాడు.

"తుపాకులూ, తూటాలూ తయారుచేసే ఫ్యాక్టరీ వుందని మీరు మర్చిపోయినట్టున్నారు. కావాలంటే నా దగ్గరున్న స్టాక్సుక పర్మిట్ వుంది. చూస్తారా?" అంటూ లోనికి వెళ్ళి పర్మిట్ తెచ్చి చూపించాడు మల్‌హోత్రా.

"న్యూక్లియర్ క్లబ్"లో జరిగిన ప్రమాదం గురించి అడుగగా, తాము అసలు అక్కడకు రానేలేదని చెప్పాడు మల్హోత్రా.

మల్‌హోత్రా ఇచ్చిన ఆతిథ్యం స్వీకరించి, అతడు వారిని అక్కడ వుండమని బలవంతం చేసినా సాదరంగా నిరాకరించి మళ్ళీ వెనక్కు బయలుదేరారు.

10

పాకిస్తాన్ ప్రతినిధి కారు వేగంగా పోతోంది. అతడు మరో పదినిముషాల్లో అణ్వాస్త్ర మహాసభ ఆఖరు సమావేశానికి హాజరవుతున్నాడు.

అతడు వెనకసీట్లో కూర్చున్నాడు. అతడి చుట్టూ బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్ అమర్చబడివుంది. డ్రైవరుకూ అతడికీ మధ్యగూడ గాజుగోడ అడ్డంవుంది.

"అందరి ప్రతినిధులకూ డ్రైవర్లు మారిపోయారా?" అని అడిగాడు ప్రతినిధి.

అతడి మాటలు మైక్రోఫోన్‌లోంచి అవతలకు వినబడుతున్నాయి. అలాగే డ్రైవరు మాటలుగూడ అదే పద్ధతిలో వెనుక సీట్‌లో కూర్చున్న వ్యక్తికి వినబడతాయ్.

"అవును సార్! ఈ మహాసభకు హాజరయే ప్రతినిధులందరి కార్లకు మాదేశపు సీక్రెట్ ఏజెంట్లు డ్రైవర్లుగా పంపబడ్డారు. మీ రక్షణ గురించే ఈ ఏర్పాటు చేయబడింది" అన్నాడు డ్రైవింగ్ సీట్లో కూర్చున్న సుధాకర్.

"ఎలాగైనా మీ ఇంటలిజెన్స్ డిపార్టుమెంటులో మేధావులున్నట్టున్నారే!" ప్రతినిధి మెచ్చుకోలుగా అన్నాడు.

కారు డ్రైవ్ చేస్తున్న సీక్రెట్ ఏజెంట్ సుధాకర్ గర్వంగా, తృప్తిగా నవ్వాడు.

రోడ్డుప్రక్కగా నిలబడి కారు ఆపమని చెయ్యి ఊపుతున్నాడో వ్యక్తి.

వెనుకసీట్లో కూర్చున్న ప్రతినిధి అతడ్ని పరీక్షగా చూశాడు.

"డ్రైవర్! కారాపు! అతడూ మా ప్రభుత్వాధికారిలా వున్నాడు. అతడికీ లిఫ్టు కావాలేమో!" అన్నాడు ప్రతినిధి.

కారు ఆపాడు సుధాకర్.

పాక్ ప్రతినిధి కారుడోర్ తెరిచి ఆగంతకుడ్ని కారు లోకి ఎక్కించుకున్నాడు. కారు మళ్ళీ బయలుదేరింది.

వెనుక సీట్లో చిరునవ్వుతో మాట్లాడుకుంటున్న వ్యక్తుల్ని తన సీటు కెదురుగా బిగించబడిన అద్దంలో కనిపెడుతూనే వున్నాడు డ్రైవరు.

రెండు నిముషాలు గడిచాయో లేదో ఆగంతకుడు తన కోటు జేబులోంచి రివాల్వర్ ని తీసి పాక్ ప్రతినిధి కణతకు ఆనించి పెట్టాడు.

ప్రాణభయంతో ప్రతినిధి అరుస్తున్నాడు. తనను చంప వద్దని బ్రతిమాలుతున్నాడు.

"డ్రైవర్! కారాపు!" అన్నాడు ఆగంతకుడు.

డ్రైవింగ్ సీట్లో కూర్చున్న సీక్రెట్ ఏజెంట్ ఏమీ బెదరలేదు. ఆగంతకుని చేతిలో పిస్తోలు వున్నా అతడికీ, తనకూ మధ్య బుల్లెట్ ప్రూఫ్ గాజుగోడ వుంది. కాక పోతే అతడు పాక్ ప్రతినిధిని హత్య చేయకుండా కాపాడ వలసిన బాధ్యత తన మీదుంది.

"కారాపుతావా? లేదా?" ఆగంతకుడు మరోసారి అన్నాడు.

"ఆపుతాను! ఇక్కడ కాదు! పోలీస్ స్టేషన్ ముందు!" అంటూ తన సీటు క్రింద వున్న స్విచ్ ని నొక్కాడు. అది హెడ్ క్వార్టర్స్ కి రహస్య సంకేతం, పిట్ట వలలో పడిం దని!

"కారు ఆపకపోతే ఈ ప్రతినిధిని చంపి శవాన్ని

గోడుమీదకు విసిరేస్తాను."

"కారు డోర్స్ ఆటోమేటిక్ గా లాక్ చేయబడినై. నీవు తప్పించుకు పోలేవు!"

"అలాగేం! అంత తేలికగా నీ చేతికి దొరుకుతాననుకోకు! ఇతడి ప్రాణాలు తీసి, ఆ తర్వాత నేను ఆత్మహత్య చేసుకుంటాను. కనుక మంచిగా నా మాట విను!"

డ్రైవర్ ఆలోచిస్తున్న వాడి మాదిరిగా కారు పోనిస్తూ గభాల్న జర్క్ ఇచ్చి కారుని మలుపుత్రిప్పాడు. ఆగంతకుడు తూలిపడ్డాడు సీట్లోనే. అతడి చేతిలోని పిస్తోలు క్రింద పడిపోయింది.

సీక్రెట్ ఏజెంట్ మరో బటన్ నొక్కాడు. వెనుక సీట్లోకి తెల్లని పొగలాంటిది ప్రవేశించింది. పిస్తోలు అందుకోవటానికి ముందుకు వంగిన ఆగంతకుడికి మత్తు కమ్మింది. అలానే ముందుకు వంగి పడిపోయాడు.

కారు మిలిటరీ హెడ్ క్వార్టర్స్ ముందు ఆగింది. లోపల్నుంచి పోలీసులు, గూఢచారి దళంవారు వచ్చి కారుని చుట్టుముట్టారు.

డోర్స్ తెరచి ఇద్దర్నీ లోపలకు చేర్చారు. ఆగంతకుడ్ని ప్రత్యేక గదిలో వుంచి గట్టి కాపలా ఏర్పరచబడింది.

పాక్ ప్రతినిధికి స్మెల్లింగ్ సాల్ట్స్ వాసన చూపించాడు, మిలిటరీ డాక్టర్. అతడికి తెలివి వచ్చింది. కళ్ళు తెరచి "నేనెక్కడున్నాను?" అని అడిగాడు.

"కాన్ఫరెన్స్ హాల్ కి వెళ్ళేదోవలో మీరు కారులో స్పృహతప్పి పోయారు. ఈ ఇంజెక్షన్ తో మీకు స్వస్థత చిక్కుతుంది" అంటూ డాక్టర్ అతడి చేతికి ఇంజెక్షన్ ఇచ్చాడు.

పాక్ ప్రతినిధి ఉషారుగా లేచి కూర్చున్నాడు. "నేనిక

వెళ్ళవచ్చా? ఇప్పటికే లేట్ అయిపోయిందేమో!'' అన్నాడు.

డాక్టర్‌కి థాంక్స్ చెప్పి, మళ్ళీ వచ్చి కారులో కూర్చున్నాడు. కారు బయలుదేరి వెళ్ళిపోయింది.

ఆగంతకుడికి స్పృహ తెప్పించే ప్రయత్నంలో వుండగా పోలీస్ స్టేషన్‌కి బయట ''హెల్ప్! హెల్ప్!'' అని ఎవరో పెద్దగా అరవటం వినిపించి అందరూ బయటకు పరుగెత్తారు.

రోడ్డుమీద ఒకవ్యక్తి జుట్టు రేగిపోయి, చిరిగిపోయిన గుడ్డలతో చలికి వణుకుతున్నాడు. సామాన్యంగా ఆ సీజన్‌లో ఎవరూ ఒంటిమీద కోటు లేకుండా రారు.

''ఎవరు నీవు! ఏం సహాయం కావాలి?'' ఎవరో కానిస్టేబుల్ అడిగాడు.

''నేను అణ్వాస్త్ర మహాసభకు హాజరవాల్సిన పాకిస్థాన్ ప్రతినిధిని. ఎవరో నన్ను నా లాడ్జిగదిలో బంధించి, నా దుస్తులు తొడుక్కొని, నా వేషంలో మహాసభకు వెళ్లారు. నేను తప్పించుకుని వచ్చేసరికి ఈ సరి అయింది'' అసలు పాక్ ప్రతినిధి తన గాథను ఏకరవు పెట్టాడు.

ఆ మాటలు వింటూనే అందరూ కొయ్యబారిపోయారు. మహేంద్ర, ఛటర్జీలు తెల్ల మొగాలు వేశారు.

ఆగంతకులెవరో తమను బాగా బుట్టలో వేశారు. అసలు పాక్ ప్రతినిధిని గదిలోనే బంధించేశారు. మరో వ్యక్తి అతడి బట్టలు వేసుకుని సీక్రెట్ ఏజెంట్ తెచ్చిన కారులో ఎక్కాడు. మధ్యలో మరోవ్యక్తి అతడ్ని బంధించే వాడిలా అడ్డం తగిలాడు. తమకు పిట్ట దొరికిందనే సంతోషంలో ఆగంతకుడ్ని బంధించి, నకిలీ పాక్ ప్రతినిధిని రాజలాంఛనాలతో, ప్రభుత్వ వాహనంలో మహాసభకు పంపారు.

లోపల బంధించబడిన ఆగంతకుడినుంచి సమాచారం, సమాధానం రాబట్టుకోవాలనే ఆత్రుతతో మహేంద్ర లోపలకు పరుగెత్తాడు. ఫాటర్జీగూడ, అసలు ప్రతినిధికి కావలసిన సహాయం చేయమని తన అసిస్టెంట్ కి చెప్పి, లోపలకు వచ్చాడు.

ఆగంతకుడి గుండెల్లో కత్తి దిగబడి వుంది. ఆగంతకుడి శరీరం పచ్చగా అయిపోయింది.

కత్తికి విషం పూయబడి వుంది. దాన్ని గోడమీద నుంచి కిటికీగుండా ఎవరో అతడికి తగిలేలా గురిచూసి విసిరారు.

కత్తి గుండెల్లో దిగబడింది. కత్తికి పూయబడిన విష ప్రభావం వల్ల ఆ వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు.

11

అణ్వస్త్ర మహాసభ జరుగుతున్న భవనం చుట్టూ గట్టి కాపలా ఏర్పాటు చేయబడింది. అందరూ ఆత్రుతగా అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయేమో అని వెయ్యి కళ్ళతో ప్రతిఒక్కడి కదలికనూ గమనిస్తున్నారు.

ఈ అలజడి సంగతి లోపల సభలో కూర్చున్న ప్రతినిధులకు ఎవరికీ తెలీదు. లోపల సభ్యులంతా వేదికపై ప్రసంగిస్తున్న ఇరాన్ ప్రతినిధి మాటలు ఆలకిస్తూ కూర్చున్నారు.

నకలీ పాకిస్తాన్ ప్రతినిధి మాత్రం సభ నాలుగు వేపులా కలయజూస్తున్నాడు. తన పథకాన్ని మరో అర గంటలో అమలుజరిపి, తను తెలివిగా తప్పుకోవాలి. ఇంత వరకూ తన నిజస్వరూపాన్ని ఎవరూ గుర్తించలేదు. తనను నిజమైన పాక్ ప్రతినిధిగా భావిస్తున్నారు.

కుర్చీల వెనుకగా పిల్లిగడ్డం వేసుకుని ఏవో కాగితాలు

చేత పుచ్చుకుని ఒక వ్యక్తి పాక్ ప్రతినిధి దగ్గరకు వచ్చాడు.

"సలామ్ ఆలేకుం జనాబ్! మరో అరగంటలో మీరు వేదిక మీదికెక్కి ప్రసంగించవలసి వుంది. ప్రసంగపాఠాన్ని తయారుచేశాను. అది ఇక్కడ చూడడం బాగుండ దేమో! ఒక్కసారి లోపలి గదిలోకి వస్తే..." అంటూ వినయంగా గొణిగాడు ఆ వ్యక్తి.

నకిలీ ప్రతినిధి అతడివంక తేరిపార చూశాడు.

"ఇదేమిటి జనాబ్! కొత్తవ్యక్తిని చూసినట్టుగా చూస్తున్నావు. నేను మీ సెక్రటరీ యాకూబ్‌ని!"

నకిలీ ప్రతినిధి సర్దుకున్నాడు. తనను తాను తమాయించు కుంటూ "అవును! నీవు సెక్రటరీవి కాదని ఎవరన్నారు? ఆ ప్రసంగం ఇంత ఆలస్యంగానా తేవటం!" అని విసు క్కున్నాడు.

"క్షమించాలి! సభలోకి వచ్చేముందు రెస్ట్‌రూంలోకి వచ్చి వెడతానన్నారు మీరు! అందుకోసం నేను అక్కడే వెయిట్ చేస్తూ వుండిపోయాను. మీరు సరాసరి సభలోకి వచ్చేసినట్టున్నారు!"

"అవునవును! సరే! రెస్ట్‌రూమ్‌లోకి పద వస్తున్నాను" అంటూ సెక్రటరీని పంపేశాడు.

పానకంలో పుడకలాగ వీడొకడు! తన ప్లాన్‌ని భగ్నం చేసేలాగున్నాడు. అయినా ఇంతదూరం వచ్చి తను వెనుకాడితే, తన ఉనికిని పసిగట్టి, ఈ సెక్రటరీగాడు నలుగుర్నీ కేకలేసి పిలవ్వచ్చు. కనుక తను కొంచెం ఓర్పు వహించి, వీడ్ని త్వరగా తెమల్చి, తను ప్రసంగించాల్సిన సమయానికి ముందే తన పని సానుకూలం చేసుకుని, బయట పడాలి.

రెస్టురూమ్ వాకిట్లోకి వెళ్ళి, లోపల ఇంకా ఎవరైనా అనుమానాస్పదమైన వ్యక్తులున్నారేమో అని తొంగి చూశాడు నకిలీ ప్రతినిధి.

సెక్రటరీ, మరో లేడీ స్టెనో మాత్రమే వున్నారు లోపల. తనకోసం ఏదైనా వల పన్నారేమో అనే అనుమానంతో అతడు గది నాలుగుప్రక్కలా చూసి అనుమానం నివృత్తి చేసుకుని మరీ గడపదాటాడు.

ప్రసంగపాఠం నాలుగైదు పేజీలు వుంది. అతడు దాన్ని తిరగేసే లోపలే కరెంటుపోయింది గాబోలు లైట్లు ఆరిపోయినయ్.

పట్టపగలే అయినా, ఆ గదిలో లైట్లు లేకపోతే చీకటిగా అయిపోయింది.

"కరెంటుపోయింది కాబోలు!" అన్నది స్టెనో తియ్యని కంఠం.

"అవును! అంతే అయి వుంటుంది!" సెక్రటరీ వంత పలికాడు.

మరుక్షణంలోనే లైట్లు వెలిగినయ్. నకిలీ ప్రతినిధి తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. అతడిచుట్టూ మనుష్యులున్నారు. వాళ్ళ చేతుల్లో నల్లగా పిస్తోళ్ళు మెరుస్తున్నయ్.

పాక్ ప్రతినిధి చెయ్యి జేబులో పెట్టుకోబోయాడు. ఒకవైపునుంచీ స్టెనో, మరో ప్రక్కనుంచి సెక్రటరీ కాట్లకుక్కలా మీదపడ్డారు.

నకిలీ ప్రతినిధి వాళ్ళనుంచి విడిపించుకోటానికి పెనుగులాడాడు.

ఆడదైనా స్టెనోగూడ అతడి చేయిని తన చంకలో ఇరికించుకుంది గట్టిగా.

అతడి ముఖానికి నాప్కిన్ వేసి నొక్కారు. క్లోరో

ఫారమ్ వాసన వేసింది గట్టిగా. నకిలీ పాక్ ప్రతినిధికి తెలివి తప్పిపోయింది. జేబులోని హ్యాండ్ గ్రెనేడ్స్‌ని విసిరే అవకాశం రాకపోగా పోలీసుల చేతులో పడకుండా తప్పించుకునేందుకు ఆత్మహత్య చేసుకొనే వీలుగూడ కలగలేదు.

గదిలోంచి నకిలీ పాక్ ప్రతినిధి బయటకు తీసుకుపోయే సమయానికి, అసలు ప్రతినిధి వేదికమీదకు వచ్చాడు తన ప్రసంగాన్ని మొదలెట్టేందుకు.

12

నకిలీ పాక్ ప్రతినిధి జేబులు సోదాచేసి ప్రేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

"ఇక నీవెవరో, ఎందుకీ దురాగతానికి ఒడిగట్టావో చెప్పు మిస్టర్!" అన్నాడు మహేంద్ర అతడివంక కోపంగా చూస్తూ.

అతడు గుడ్లప్పగించి అలానే చూస్తూండిపోయాడు.

ఛటర్జీ అతడి ముఖంలోకి అనుమానంగా చూశాడు. మరుక్షణం అతడి గడ్డంక్రింద చేయిపెట్టి వ్రేళ్ళతో చురుకుగా అతడి ముఖానికున్న సన్నని మాస్క్‌ని లాగేశాడు.

అతడు ఎవరో కాదు, మల్‌హోత్రా!

"మల్‌హోత్రా!" అన్నాడు మహేంద్ర.

"అందుకే నీ నిజస్వరూపాన్ని కనుక్కోలేకపోయాం. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడని సామెత. మేం మొదటగా ఈ ప్లాన్ వెనుక ఏదో విదేశీ హస్తం ఉండవచ్చని భ్రమపడ్డాం. చివరకు మన దేశస్థుడే మన దేశ పరువు ప్రతిష్ఠలు మంట గలపడానికి పూనుకున్నాడన్న మాట!" ఛటర్జీ కోపంగా అన్నాడు.

"ఇప్పటికైనా నిజం చెప్పటం నీ ఒంటికి మంచిది, మిస్టర్ మల్‌హోత్రా!" అని అరిచాడు మహేంద్ర.

"చెబుతాను సర్! మన దేశం చుట్టూ వున్న పొరుగు దేశాలు పాకిస్తాన్, చైనాలు ఎప్పుడు మనమీద దెబ్బ తీయటానికి కాచుకుని వున్నయ్. అటువంటప్పుడు మన దేశం అణ్వాస్త్ర శక్తి కేవలం శాంతియుత పద్ధతులకే వుపయోగించటం నాకు నచ్చలేదు. మనంగూడ ఆటం బాంబుల్ని, హైడ్రోజన్ బాంబుల్ని తయారుచేసుకోవాలి. అప్పుడే మన పొరుగుదేశాలు మన బలాన్ని గుర్తించి మన జోలికి రాకుండా వుంటాయి.

"ఈ సమావేశం భగ్నంచేస్తే, అన్ని దేశాల ప్రతినిధులు మనపై అలిగి వెళ్ళిపోతారు. మనకు శత్రువులు ఎక్కువైతే అప్పుడే మనం జాగ్రత్తగా వుండి దేశ రక్షణకోసం అణ్వాయుధాల్ని తయారుచేయగలం. అదే వుద్దేశ్యంతో ఈ సభను భగ్నం చేయటానికి ప్లాన్ వేశాను" మల్‌హోత్రా మెల్లగా చెప్పాడు.

"మిస్టర్ మల్‌హోత్రా! మనదేశం అణ్వాస్త్రాలను చేయాలో, అక్కర్లేదో నిర్ణయించ వలసింది నీవూ, నేనూ కాదు. ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ఈ విషయంలో నీవు చట్టాన్ని నీ చేతిలోకి తీసుకోవటం సహించరానిది" మహేంద్ర అరిచాడు.

"నెక్స్ట్! లక్ష్మణన్‌ని హత్య చేయాల్సిన అవసరం ఏమిటి?" ఛటర్జీ అడిగాడు.

"నేనూ అతడూ ఇద్దరం ఉక్కు కర్మాగారాలకు అధిపతులమే! మా ఫ్యాక్టరీల్లో తుపాకులు మొదలైనవి తయారవుతాయ్. ఇరాన్, ఇరాక్ దేశాలు మనదేశంనుంచి

తుపాకుల్ని దిగుమతి చేసుకునే వుద్దేశ్యంతో వున్నాయని తెలిసి, ఆ దేశాలనుంచి ఆర్డర్లు సంపాదించుకోవాలని ప్రయత్నిస్తున్నాం. ఈ ప్రయత్నంలో లక్ష్మణన్ కృత కృత్యుడయేలా తోచి అతడ్ని నా దారినుంచి అడ్డు తొలగించుకోవడానికే హత్య చేయించాను. అతడి హత్యతో కేసు మరో దోవపట్టి, సభను భగ్నం చేయ టానికి మరింతగా అవకాశం కలుగుతుందని ఆశించాను'' అంటూ మల్హోత్రా ముగించాడు.

—:ఐ పో యిం ది:—